ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0

ఎంపీలుగా ప్రమాణ స్వీకారం


ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కేంద్ర మంత్రి వర్మ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏలూరు పార్లమెంట్ సభ్యుడిగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సోమవారం పదవీ ప్రమాణం చేశారు. అట్టహాసంగా ప్రధాన మంత్రి, మిగతా కేంద్ర మంత్రులు ప్రమాణం చేయగా, ఎంపీలు కూడా వరుస క్రమంలో ప్రమాణం చేశారు. ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా తొలిసారిగా ఎన్నికైన పుట్టా సైతం ప్రమాణం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్కడా తడ బడకుండా ఆంగ్లంలో ప్రమాణం చేశారు. ఏలూరు లోక్‌సభ స్థానం ప్రజలు తననెంతో అభిమానించి, ఆదరించి తెలుగుదేశం అభ్యర్థిగా

▸▸ ప్రజల రుణం తీర్చుకుంటా : పుట్టా మహేశ్

తనను భారీ మెజార్టీతో గెలిపించిన అందరి రుణం తీర్చుకుంటా నని ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మహేష్ కుమార్ యాదవ్ మరోసారి స్పష్టం చేశారు. ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఐటీ మంత్రి నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏలూరు నుంచి ఢిల్లీకి వచ్చి లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఏలూరు పార్లమెంట్ స్థానం చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ ఎల్లవేళలా కృతజ్ఞతతో ఉంటానని, వీరి రుణం తీర్చుకుంటానని, ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు. తన గెలుపునకు కారణమైన మంత్రి పార్థసారథి, ఏలూరు టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో పాటు వివిధ నియోజకవర్గ కూటమి పక్ష శాసన సభ్యులు అందరికి ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు నరసాపురం లోక్‌సభ సభ్యుడిగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పార్లమెంట్‌లో సోమవారం తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.


ఏలూరు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పుట్టా

జిల్లాలో విస్తారంగా వర్షాలు

ఏలూరు సిటీ, జూన్ 24 : జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావం ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. ఆదివారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 31.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 4.7 మిల్లీ మీటర్లుగా నమోదైంది. నూజివీడు-22.4, వేలేరుపాడు- 9.6, పోలవరం- 9.2, బుట్టాయిగూడెం- 7, ముసునూరు-7, జంగారెడ్డిగూడెం- 5.4, ఆగిరిపల్లి-5.4, భీమడోలు- 5.2, ఏలూరు అర్బన్- 5.2, పెదవేగి-4.2, చాట్రాయి-3.2, నిడమర్రు-2.8, కామవరపుకోట-2.6, టి.నరసాపురం- 2.4, కుక్కునూరు-2.4, ద్వారకా తిరుమల-2, లింగపాలెం- 1.8, చింతలపూడి-1.2, ఏలూరు రూరల్- 0.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. సోమవారం పోలవరం మండలంలో భారీ వర్షం కురిసింది.

టమోటా, ఉల్లి ధరల నియంత్రణ : జేసీ

ఏలూరు సిటీ, జూన్ 24 : ప్రస్తుతం పెరుగుతున్న టమాటా, ఉల్లి ధరలను నియంత్రించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జేసీ, జిల్లా ధరల నియంత్రణ కమిటీ అధ్యక్షులు బి.లావణ్యవేణి అధికారులను, హోల్‌సేల్ వ్యాపారుల సంఘ ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడుతూ 10 రోజుల క్రితం కిలో రూ.34 ఉన్న టమాటా ధర రూ.60లకు పెరిగిందని, మిగిలిన కూరగాయలు, ఉల్లిపాయలు పెరుగుతున్నాయన్నారు. మదనపల్లి నుంచి టమాటాలను తక్కువ ధరకు తీసుకొచ్చి జిల్లాలోని ఏలూరు-1, ఏలూరు-2 , కైకలూరు, నూజివీడులలోని రైతు బజార్లలో రెండు విభాగాల్లో 40 నుంచి 50 రూపాయలకు అమ్మేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధరల నియంత్రణపై తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని, ధరలు, నాణ్యతా విషయంలో తేడాలుంటే చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, ఏపీఎంఐపీ పీడీ రవికుమార్, మార్కెటింగ్ ఏడీ మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి అతిసార నివారణకు కార్యాచరణ

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 24 : అతిసార (డయేరియా) నివారణకు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమాలను జిల్లా అంతటా నిర్వహించనున్నట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లాస్థాయి సమ న్వయ కమిటీ సమావేశం జరిగింది. డీఐవో మాట్లాడుతూ విద్య, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కలిసి పనిచేస్తాయన్నారు. ప్రతీవారం చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన ప్రణాళిక ఉంటుందన్నారు. పారిశుధ్య డ్రైవ్‌లు, మురుగు నీరు నిల్వలు లేకుండా చూడడం, పూడికలు తొలగించడం, మార్కెట్‌లు, మురికివాడలు, తాత్కాలిక నివాసాలపై దృష్టి సారిస్తామన్నారు. చేతులు శుభ్రపరుచుకోవడంపై పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, డీపీవో శ్రీనివాస్, డీఈవో అబ్రహం, ఐసీడీఎస్ అధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మద్ది ఆలయ పాలక మండలి రాజీనామా

జంగారెడ్డిగూడెం, జూన్ 24 : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కీసరి సరిత విజయభాస్కర రెడ్డితో పాటు సభ్యులు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

పేదోళ్లకు పండుగ!



పేదవర్గాలు ఆశతో ఎదురు చూస్తున్న క్షణం రానేవచ్చింది. వచ్చేనెల 1వ తేదీన ప్రతి పేదవాడికి రూ.7వేలు పింఛన్ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచిన పింఛన్‌తో పాటు గడిచిన మూడు నెలలు పెండింగ్‌లో ఉన్న రూ.3వేలు జోడించి జూలై ఒకటిన ప్రతి పింఛన్‌దారుడికి రూ.7 వేలు చేతికి అందించబోతున్నారు. ఎన్నికల సమయంలో పేదవర్గాల కష్ట నష్టాలను క్షేత్రస్థాయిలో గమనించి ఆయా కుటుంబాల్లో తానే పెద్దదిక్కుగా ఉంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ఒక్క ఏలూరు జిల్లాలోనే కోట్ల రూపాయలు అదనంగా పింఛన్‌దారులకు చేరనుంది.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రూ.4 వేలకు పింఛన్ పెంపుపై సర్వత్రా హర్షం

- ▸▸ పాలనా పగ్గాలు చేపట్టగానే చంద్రబాబు కీలక నిర్ణయం
- ▸▸ వచ్చేనెల ఫస్ట్‌నే అందరికీ పింఛన్లు
- ▸▸ ఈసారి అదనపు పింఛన్‌కు రూ.65 కోట్లు ఖర్చు
- ▸▸ మొత్తం మీద ఈ ఒక్కసారికే రూ.165 కోట్లు వ్యయం

ఒకప్పుడు పేదవర్గాలు దివ్యాంగులు, వితంతువులు ఇలా మిగతా వర్గాల్లోను అర్హులకు నెలకు పింఛన్ అందిస్తూ వచ్చారు. రానురాను పెరుగుతున్న ఖర్చులు, వైద్య అవసరాలు దృష్టిలో పెట్టుకుని ఇప్పుడిస్తున్న పింఛన్ ఏ మూలకు సరిపోవడం లేదని ఆయా వర్గాలను ఆదుకోవాలంటే కొంతలో కొంత అయినా పెంచి అందించాలని చంద్రబాబు ఇంతకు ముందే ఒక నిర్ణయానికి వచ్చారు. దీనినే గడిచిన ఎన్నికల సమయంలో ప్రజల ఎదుట ఉంచారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పేద వర్గాలకు పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని అప్పట్లోనే భరోసా ప్రకటించారు. ఈ లెక్కన పేద వర్గాలకు నెలవారీ ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.80 కోట్ల నుంచి రూ.115 కోట్లకు పెరుగుతుందని, దీని అదనపు భారం రూ.35 కోట్లు పైనే ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. అయినా పర్వాలేదు పేదవర్గాలకు ఇచ్చిన మాట ఖచ్చితంగా ఇదేనెల నుంచి నిలబెట్టుకునేలా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు పింఛన్ పెంచుతూ ఫైల్‌పై సంతకం చేశారు. అంతేకాకుండా గడిచిన మూడునెలలుగా పింఛన్ రూ.4వేలుగానే భావించి ఆ పెండింగ్‌లో ఉన్న రూ.3వేలును ఇప్పుడు ఇచ్చే పింఛన్ రూ.4వేలతో కలిపి రూ.7వేలు మొత్తాన్ని ఒక్కో లబ్ధిదారుడికి ఈ ఫస్ట్‌నే అందిస్తున్నారు. ఈ లెక్కన జూలై 1వ తేదీన అందించే పింఛన్ల మొత్తం వ్యయం రూ.165 కోట్లుగా లెక్క తేలింది.

మాట నిలబెట్టుకునే దిశగా..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా ఖాతరు చేయకుండా రాష్ట్రప్రభుత్వం మాట నిలబెట్టుకునే దిశగా ధైర్యం చేసింది. ఎన్నికల్లో బూటకపు హామీలు ఇస్తున్నారని అమలు కాని మాటలు జనం ముందు మాట్లాడుతున్నారని, ఇవేమి నమ్మవద్దని అప్పట్లోనే అధికార వైసీపీ నానా యాగీ చేసింది. కాని తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ తొలి సమావేశంలోనే పింఛన్ పెంచడంతో పాటు గడిచిన మూడు నెలలకు ఒక్కోనెల రూ.వెయ్యి చొప్పున రూ.3వేలు కూడా పెరిగిన పింఛన్ రూ.4వేలతో కలిపి ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే పేద వర్గాల్లో సంతోషం వెల్లివిరిసింది. ఇంతకు ముందు మాయ మాటలు, గారడీలతో అవ్వాతాతలు అంటూ అపరిమిత ప్రేమ ఒలకబోసిన వైసీపీ కాని, జగన్ కాని ఈ వర్గాలకు ఇవ్వాల్సిన పింఛన్‌ను అరకొరగానే ఇస్తూ వచ్చారు. పైపైకి గొప్పలు చెబుతూ ఆచరణకు వచ్చేసరికి మొండిచేయి చూపారు. ఏలూరు జిల్లాలోనే పింఛన్ తీసుకునే వారి సంఖ్య 2లక్షల70వేలకు పైగా ఉంది. ఆయా కుటుంబాల్లో పెరిగిన పింఛన్, పెండింగ్ పింఛన్‌ను అంతా కలిపి ఒకేసారి ఏక మొత్తంలో ఇవ్వడం శుభపరిణామంగా కూటమి వర్గాలు భావిస్తున్నాయి.

ఈసారి ఎలా పంపిణీ..

వాస్తవానికి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికీ వలంటీర్ల ద్వారానే పింఛన్ ఇచ్చి పంపేవారు. వారంతా తెల్లవారుజాము నుంచే పింఛన్ పంపిణీ ఆరంభించేవారు. ఒకటో తేదీ నుంచి మొదటి మూడు రోజుల్లోనే పంపిణీ కార్యక్రమం పూర్తిచేసేవారు. ఆఖరికి మంచం పట్టిన వారికి, ఆసుపత్రుల పాలైన వారికి పింఛన్ అక్కడే అందజేసేవారు. సహజంగా దీనికి అలవాటు పడ్డ పింఛన్ దారులు తమకు ఒకటో తేదీనే పింఛన్ అందడం, అది ఇంటికి తీసుకువచ్చి ఇవ్వడం ఎంతో సౌకర్యవంతంగా ఉందని భావిస్తూ వచ్చారు. కాని ఎన్నికల సమయంలో వైసీపీ వక్రబుద్ధి ప్రదర్శించింది. ఎన్నికల నియమావళి ప్రకారం వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి పింఛన్ కాని, ఇతరత్రా కార్యక్రమాలు కాని అమలు చేయకూడదని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇదే క్రమంలో తెలుగుదేశం మిగతా పక్షాలు స్పందించటమే కాకుండా సచివాలయ సిబ్బందితో ఎక్కడికక్కడ పింఛన్‌ను ఇంటింటికి చేర్చేలా చూడాలని పదేపదే అప్పటి రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చింది. కాని అలా చేయకుండా పింఛన్ దారుల్లో 75 శాతం మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ పోయింది. మిగిలిన 25 శాతం మందికి మాత్రమే చేతికి అందించారు. దీంతో వయో వృద్ధులు మూడునెలల పాటు పడరాని తిప్పలు పడ్డారు. బ్యాంకుల చుట్టూ తిరిగారు. దీని వ్యతిరేకత అంతా కూటమి పైన పడాలన్నదే అప్పటి వైసీపీ రాజకీయ కుట్రగా మిగతా పార్టీలు అన్ని బహిరంగంగానే విమర్శించాయి. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ పొందే అర్హులు అందరికి ఇంటివద్దే అదీ ఒకటో తేదీనే అందరికీ అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై పూర్తి కసరత్తు కొనసాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పెరిగిన పింఛన్ రూ.7వేలు మొత్తాన్ని ప్రతి పింఛన్‌దారుడికి అందించాలని ఇది కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంగా చెప్పాలని ఇక ముందు కూడా ప్రతినెల రూ.4వేలు చొప్పున పింఛన్ చేతికి అందిస్తామని భరోసా ఇచ్చే దిశగా ప్రత్యేక ఏర్పాట్లలో ప్రభుత్వం తలమునకలై ఉంది. దీనికి సంబంధించి 12 రోజుల్లోనే మార్గదర్శక సూత్రాలను జారీ చేయబోతున్నారు. ఇంకోవైపు ఈసారి వలంటీర్‌లలో అత్యధికులు తమ పదవికి రాజీనామా చేశారు. మరికొందరు మాత్రం నెలవారీ విధుల్లో పాల్గొంటున్నారు. పింఛన్ బాధ్యత వీరికే అప్పగిస్తారా? లేకుంటే సచివాలయ సిబ్బందికి అప్పగిస్తారా అనేది ఇప్పుడు అందరిని వేధిస్తున్న ప్రశ్న. ప్రత్యేకించి పింఛన్‌దారులు సంతృప్తి పడాలన్నా ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నందున ఆ దిశగానే తుది నిర్ణయం ఉంటుందని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఒక్కో జిల్లాలోనూ జూలై 1వ తేదీన దాదాపు రెట్టింపు పింఛన్ సొమ్ము అందజేయాల్సి వస్తున్నందున జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకించి ఇప్పటికే కేబినెట్‌లో కూడా ఇదే విషయం పై చర్చ సాగిందని, తదుపరి కీలక ఆదేశాలు అన్ని అధికారులకు అందే అవకాశం లేకపోలేదని సమాచారం.

ఇదిలా ఉండగా తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూలై 1వ తేదీనే పింఛన్ అందించడంతో పాటు టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయ డం, పింఛన్ పెంచడంతో సహా మిగతా మూడు అంశాలను రాష్ట్రమంత్రివర్గం ఆమోదించడం వంటి చర్యలు ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఉన్న అభి మానాన్ని రెండింతలు చేసిందని ఎమ్మెల్యేలు భావిస్తు న్నారు. రైతులు, మహిళలు సంతృప్తి చెందేలా కూటమి తీసుకున్న నిర్ణయాలు తమకు క్షేత్రస్థాయిలో ఆయువుపట్టులాంటి దని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. భవిష్యత్‌లో జరగ బోయే ఎన్నికలు అన్నింటి పైనా దీని ప్రభావం స్పష్టంగా ఉంటుందని ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో వ్యవహరించడం జగన్ ప్రభుత్వ విధ్వంసకర పాలనకు ఉన్న తేడాను నేరుగానే తేల్చివేస్తున్నారని ఆనందంతో ఉన్నారు.


డీపీటీవో, డిపో మేనేజరుపై చర్యలు తీసుకోవాలి..

ఏలూరు కలెక్టరేట్, జూన్ 24 : ఏలూరు జిల్లా డీపీటీవో, ఏలూరు డిపో మేనేజరు ఏలూరు డిపోను సొంత సామ్రాజ్యంగా భావించి కార్మికులను, ఉద్యోగులను అసభ్య పదజాలంతో దూషిస్తూ చిన్న విషయానికే సస్పెండ్ చేస్తూ రీమూవల్ చేస్తానని బెదిరిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ ఏలూరు డిపో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఎన్ఎంయూ సెక్రటరీ పీఎస్ రావ్, ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ డి.అర్జున్‌రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ ఏలూరు డిపో బస్సులను మరమ్మతులు చేయించకుండా క్రాఫ్ట్ కంట్రోల్ పేరుతో మెటీరియల్ తెప్పించడం లేదన్నారు. దానివల్ల బస్సులు కండిషన్ బాగోలేక ప్రయాణికులు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. పరికరాలు అడిగిన మెకానిక్‌లకు అక్రమంగా ఛార్జ్‌షీట్‌లు ఇస్తున్నారని, రిపేర్లు ఉన్నాయని చెప్పిన డ్రైవర్లను డిపో మేనేజరు వేధిస్తున్నారని ఆరోపించారు. సిబ్బందికి రావాల్సిన ఆర్థిక విషయాల్లో కోతలు విధిస్తూ ఇవ్వాల్సిన శాంక్షన్ ఇవ్వకుండా ఆర్టీసీ సిబ్బంది పని చేయడం లేదని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు. అత్యవసర సమయంలోను సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. ఇదే సమయంలో కలెక్టరేట్‌కు వచ్చిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. న్యాయం చేయాలని వేడుకొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

సోమవరం బొగ్గు గనులకు వేలం ప్రకటన

చాట్రాయి, జూన్ 24: చాట్రాయి మండలం సోమవరం గ్రామంలోని బొగ్గు గనులకు కేంద్ర ప్రభుత్వం తాజాగా వేలం ప్రకటన విడుదల చేసింది. మూడేళ్ల క్రితం ఈ గనులకు వేలం ప్రకటన విడుదల చేయగా ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం జరగలేదు. అప్పటి పరిస్థితుల కారణంగా ఈ వేలంపై సింగరేణి సంస్థ ఆసక్తి చూపకపోవడంతో వేలం ప్రక్రియ ముందుకు సాగలేదు. చాట్రాయి మండలానికి 25 కిలో మీటర్ల దూరంలోని తెలంగాణ పరిధిలోని సత్తుపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు జరుపుతున్నందున సోమవరం బొగ్గు గనులను సింగరేణి సంస్థ దక్కించుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా జి.కిషన్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత బొగ్గు గనుల వేలం తెరపైకి వచ్చింది. ఇరవై ఏళ్ల క్రితం జియోజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సోమవరం, చింతలపూడి, తడికలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో బొగ్గు నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించింది. సోమవరంలో 15 ఏళ్ళ క్రితం సింగరేణి సంస్థ సర్వే నిర్వహించి ఇక్కడ 50 ఏళ్లకు సరిపడా గ్రేడ్-1 బొగ్గు నిల్వలు ఉన్నట్టు అంచనా వేశారు. పదేళ్ల క్రితమే ఇక్కడ బొగ్గు తవ్వకాలు మొదలుపెడతారని అంతా భావించారు. అయితే రాష్ట్ర విభజన జరగడంతో ఈ అంశం మరుగున పడింది. ఇక్కడ బొగ్గు తవ్వకాలు ప్రారంభమైతే మారుమూలన వెనుకబడి ఉన్న చాట్రాయి మండలం అభివృద్ధి చెందుతుందని మండల ప్రజలు అంటున్నారు.


బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతానికి వెళ్ళే మట్టి రోడ్డు


బొగ్గు నిక్షేపాలు ఉన్న సోమవరం అటవీ ప్రాంతం ఇదే..

అర్జీల పరిష్కారానికి కృషి : జేసీ

- ▸▸ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రారంభం
- ▸▸ ప్రజల నుంచి 150 అర్జీల స్వీకరణ

ఏలూరు కలెక్టరేట్, జూన్ 24 : ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా త్వరిత గతిన పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టమ్) పేరుతో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రజల నుంచి మొత్తం 150 అర్జీలు స్వీకరించారు. ఉదయం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జేసీ బి.లావణ్య వేణితో పాటు డీఆర్వో డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయ్ రాజు, డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, ఎం.ముక్కంటి, ఎస్.ఎస్.ఏ ఏపీసీ పి.సోమశేఖర్, ఆర్డీవో ఖాజావలీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ అర్జీలను నాణ్యతతో పాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా, మండల కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తారని తెలిపారు. జడ్పీ సీఈవో కె.వి సుబ్బారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు, డీఈవో కె.అబ్రహం పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ లావణ్యవేణి, అధికారులు

అర్జీల్లో కొన్ని..

- ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడు చేసిన శస్త్రచికిత్సలు వికటించాయని ఆ వైద్యుడి పై చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జేసీని కోరారు. పెదవేగి మండలం వేగివాడకు చెందిన చెల్లిమాల నాగరాజు తన కుమారుడికి ప్రమాదం జరిగితే పత్తేబాదలోని ఓ ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో మోకాలికి ఆపరేషన్ చేయించాడని, అలాగే పెదవేగి మండలం గొల్లగూడెంకు చెందిన మాగంటి వెంకటేశ్వరరావుకు చేసిన ఆపరేషన్ కూడా ఫెయిల్ అయిందన్నారు. ఆ ఆస్పత్రి వైద్యుడిపై చర్యలు తీసుకుని పరిహారం ఇప్పించాలని కోరారు. దెందులూరు నియోజకవర్గంలో రైతులకు చెందాల్సిన యంత్ర పరికరాలు విషయంలో కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ చేయాలని పేర్కొన్నారు.
- తమ కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని వ్యవసాయ, ఇతర భూమిగా మార్చారని, దీనివల్ల రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు పడుతున్నామని, ఏలూరుకు చెందిన కర్రి సత్యనారాయణ అర్జీ అందజేశారు.
- ప్రధానమంత్రి కిసాన్ సొమ్ము జమ కాలేదని తంగిడగూడెంకు చెందిన లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు.
- తనకు ఇప్పటి వరకు పీఎం కిసాన్ యోజన, రైతు భరోసా రాలేదని, ఈ రెండు ఇప్పించాలని పెరికిగూడెంకు చెందిన రైతు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

మాది రైతు ప్రభుత్వం : చింతమనేని

ఏలూరు కలెక్టరేట్, జూన్ 24 : మాది రైతు ప్రభుత్వమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ధాన్యం బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలపై సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జేసీ లావణ్యవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రబీ పూర్తయి రెండు నెలలు కావొస్తున్నా రైతులకు ధాన్యం బకాయిలు నేటికీ చెల్లించకపోవడం గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. రైతులు నారుమడులు పోసుకునేందుకు ఆ డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 40 కోట్లు ధాన్యం బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట కాల్వలు కిక్కిసతో పూడుకుపోయాయని, నారుమళ్లు పోసేందుకు శివారు భూములకు నీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మాజీ మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ కొడాలి నాని దారినపోయే దానయ్య అని అటువంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కులేదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి చూపిస్తామన్నారు.


వైద్యం వికటించిన బాలుడి పరిస్థితిని జేసీకి వివరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 24 : ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పే వ్యక్తుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లా ప్రజలకు సూచించారు. నూతన ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వ హించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 50 ఫిర్యాదులను పరిశీలించి సత్వర పరిష్కారానికి ఆదేశాలిచ్చారు.

తీరనున్న సాగునీటి కష్టాలు

- ▸▸ తమ్మిలేరులో చెక్‌డ్యామ్‌కు పడిన గండిని పరిశీలించిన అధికారులు
- ▸▸ నాలుగేళ్ల క్రితమే గండి.. అప్పటి నుంచి చెరువులకు చేరని చుక్కనీరు
- ▸▸ గత ప్రభుత్వంలో మరమ్మతులు చేపట్టని అధికారులు
- ▸▸ మంత్రి పార్థసారథి ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం

ముసునూరు, జూన్ 24: మండలంలోని వెంకటాపురం వద్ద తమ్మిలేరులో ఉన్న చెక్‌డ్యామ్‌కు పడిన గండిని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సీఈ శ్రీనివాస యాదవ్, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సోమవారం పరిశీలించారు. 2020, జూలైలో తమ్మిలేరు వరద ప్రవాహానికి చెక్‌డ్యామ్‌కు గండిపడింది. ఈ గండివల్ల బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో ఉన్న ఐదు చెరువులకు సప్లయి ఛానల్ ద్వారా చుక్కనీరు చేరకపోవడంతో 800 ఎకరాల ఆయకట్టులో పంటలకు నీరు లేక గత నాలుగేళ్ల నుంచి రైతులు తీవ్రంగా నష్టతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేయాలని పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధి కారులకు రైతులు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకున్న నాథుడే లేడు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఎన్నికల సమయంలో రైతులు ఈ చెక్‌డ్యామ్ సమస్యను వివరించగా ఆయన అప్పట్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు చెక్‌డ్యామ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేయ డంతో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సీఈ శ్రీనివాసయాదవ్, ఇరిగేషన్ ఈఈ గంగయ్య, డీఈ సత్యనారాయణ, ఏఈ సలీమ్‌లు చెక్‌డ్యామ్‌కు పడిన గండిని పరిశీలించారు. త్వరలోనే చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపడతామని ఈఈ గంగయ్య ఆయకట్టు రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుల సాగునీరు ఇబ్బందులను గుర్తించి, చెక్‌డ్యామ్ మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్న మంత్రి పార్థసారథికి ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


వెంకటాపురం వద్ద చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాసయాదవ్, ఇరిగేషన్ అధికారులు

పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు 7
18 రైళ్లు రద్దు..ఆరు రైళ్లు పునరుద్ధరణ

18 రైళ్ల రద్దు..ఆరు పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 24 : దక్షిణ మధ్య నిడదవోలు- కడియం సెక్షన్ల పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ పనుల దృష్ట్యా 18 రైళ్లను సోమవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రద్దు చేసిన ఆరు రైళ్ళను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.



పునరుద్ధరించిన రైళ్లు

17257 విజయవాడ - కాకినాడ
17258 కాకినాడ పోర్టు- విజయవాడ
12806 లింగంపల్లి-విశాఖపట్టణం
ఈనెల 26 నుంచి పునరుద్ధరణ
12805 విశాఖపట్టణం -లింగంపల్లి ఈనెల 25 నుంచి..
17643 చంగల్‌పట్టు - కాకినాడ పోర్టు ఈనెల 25 నుంచి..
17644 కాకినాడ పోర్టు - చంగల్‌పట్టు ఈనెల 26 నుంచి..

రద్దయిన రైళ్లు

07466 రాజమండ్రి - విశాఖపట్టణం ఈనెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ
07467 విశాఖపట్టణం - రాజమండ్రి 24 నుంచి ఆగస్టు 10 వరకూ
17219 మచిలీపట్టణం - విశాఖపట్టణం 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17220 విశాఖపట్టణం - మచిలీపట్టణం 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17249 తిరుపతి - కాకినాడ టౌన్ 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17250 కాకినాడ టౌన్ - తిరుపతి 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17239 గుంటూరు - విశాఖపట్టణం 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17240 విశాఖపట్టణం - గుంటూరు 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17243 గుంటూరు - రాయగడ 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17244 రాయగడ - గుంటూరు 24 నుంచి ఆగస్టు 11 వరకూ
12718 విజయవాడ - విశాఖపట్టణం 24 నుంచి ఆగస్టు 10 వరకూ
12717 విశాఖపట్టణం- విజయవాడ 24 నుంచి ఆగస్టు 10 వరకూ
22702గుంటూరు-విశాఖ (సోమ,మంగళ) 24 నుంచి ఆగస్టు 10 వరకూ
22701 విశాఖ- గుంటూరు (బుధ,శుక్ర, శని) 24 నుంచి ఆగస్టు 10 వరకూ
12776 లింగంపల్లి -కాకినాడ(సోమ, బుధ, శుక్ర) 24 నుంచి ఆగస్టు 9 వరకూ
12775 కాకినాడ- లింగంపల్లి (మంగళ,గురు,ఆది) 23 నుంచి ఆగస్టు 8 వరకూ
22708 తిరుపతి-విశాఖపట్టణం (బుధ, శుక్ర,ఆది)23 నుంచి ఆగస్టు 9 వరకూ
22707విశాఖపట్టణం-తిరుపతి (సోమ,గురు,శని)24 నుంచి ఆగస్టు 10 వరకూ

సీలేరు నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, జూన్ 24: ఖరీఫ్ పంటలు, తాగు నీటి అవసరాల కోసం గోదావరి డెల్టాకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏపీ జెన్‌కో ఎస్‌ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి జెన్‌కో అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు.ఈ మేరకు గోదావరి డెల్టాకు ఆరు వేల క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 12.5 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

ప్రైవేట్ లైన్‌మేన్ మృతిపై విచారణ

'ఆంధ్రజ్యోతి' కథనంతో ఈపీడీసీఎల్ సీరియస్

నరసాపురం, జూన్ 24: ప్రైవేట్ లైన్‌మేన్ షణ్ముకం మృతిపై విచారణకు ఈపీడీసీఎల్ స్పందించింది. రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన విచారణ చేయిస్తారా? అన్న కథనంపై ప్రభుత్వం సీరియస్ అయింది. దీనిపై విచారణ చేయించాలని ఆదేశించడంతో ఈపీడీసీఎల్ ఉన్నతస్థాయి విచారణ చేపట్టింది. ఒక ఈఈ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. విశాఖ నుంచి మరో ఉన్నతాధికారి బృందం కూడా సోమవారం నరసాపురం సబ్ డివిజన్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ప్రమాదంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. సిబ్బందిని ఆరా తీస్తున్నారు. మరోవైపు ప్రమాదం జరిగిన తరువాత విషయాన్ని ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకు రాలేదన్న దానిపై కూడా ఆరా తీస్తున్నారు. కనీసం మృతి చెందిన తరు వాత పోలీసులు కేసు కట్టిన విషయాన్ని కూడా గోప్యంగా ఉంచడంపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. కొందరు అధికా రులు ఉద్దేశ పూర్వకంగా బాధ్యుల్ని కాపాడారన్న వాదనలు వినిపిస్తుండంతో దీనిపై లోతైన విచారణ చేస్తున్నారు. విచారణకు సంబంధించిన విషయాలను అధికారులు వెల్లడించలేదు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



అతిసార వ్యాధి నిర్మూలన సూచనల పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్‌వో

అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలి

భీమవరం: జూన్ 24 : అతిసార వ్యాధి నిర్మూలన సూచనల గోడ ప్రతులను జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతిసార వ్యాధి, డెంగీ, తదితర అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది విస్తృతంగా గ్రామాల్లో వార్డులలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 1 తేదీ నుంచి ఆగస్టు 30 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం తీసుకుని ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ, జిల్లా అభివృద్ధి అధికారి అప్పారావు, జిల్లా పంచాయతీశాఖ అధికారి ఆర్.విక్టర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

27న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, జూన్ 24: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 27న జరుగుతాయని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఏలూరు జిల్లా ప్రజా పరిషత్‌లోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు

ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర కోశాధికారిగా గ్రంధి




తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు కళాశాలల మేనేజ్ మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా తాడేపల్లిగూడెం వాసవీ ఇంజ నీరింగ్ కళాశాల పాలక మండలి అధ్యక్షుడు గ్రంధి సత్య నారాయణ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. ఈ సంద ర్భంగా ఆయనకు వాసవీ కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ రత్నాకర రావు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మస్తర్లలో..మాయాజాలం

- జాతీయ ఉపాధిహామీ పథకంలో అక్రమాలు
- బినామీ పేర్లతో మస్తర్లు
- మేత మేస్తున్న మేట్లు
- పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల/ అత్తిలి జూన్ 24: ఉపాధిహామీ పథకం అధికారులు, పాలకుల చేతుల్లో చిక్కి సక్రమంగా పనులు చేపట్టకపోవడంతో పక్కదారి పడుతోంది. ఏటా నిధులు పక్కదారి పడుతున్నాయని సామాజిక తనిఖీల్లో వెల్లడవుతున్నా లక్షల్లో అక్రమాలు జరిగితే వేలల్లో జరిమానాలు విధించి సరిపెడుతున్నారు. అధికారులపై చర్యలు లేకపోవడం క్షేత్రస్థాయి సిబ్బంది రాజకీయ పలుకుబడితో అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటంతో పథకం ఉద్దేశం పక్కదారి పడుతోంది. అవినీతిపరులైన కొందరు మేట్లు స్థానికంగా నివాసం ఉండని వారికి, ప్రైవేటు కంపెనీల్లో, పంచాయతీల్లో పనిచేసే వారికి మస్తర్లు వేసేస్తున్నారు. నేతల ఒత్తిళ్ల మేరకు వారి కుటుంబసభ్యుల పేరుతో జాబ్‌కార్డులు ఇచ్చి పనులకు రాకపోయినా వస్తున్నట్లు మస్తర్లు వేస్తున్నారు.బోగస్ మస్తర్లు వేస్తూ కూలీలు రాకపోయినా మేట్లు హెచ్చు మొత్తంలో సొమ్ము డ్రా చేసుకుని వచ్చిన కూలీలకు ఏదో కొంత ముట్టచెప్పి మిగిలినది దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్వారకాతిరుమల మండలంలో 16,874 జాబ్ కార్డులున్నాయి. సుమారుగా 27 వేల మంది వరకూ కూలీలున్నారు. వీరిలో కేవలం పదివేల మందిలోపే పనుల్లోకి వస్తున్నారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురం, గుణ్ణంపల్లి, తిరుమలంపాలెం, నారాయణపురం, బుట్టాయిగూడెం, పంగిడి గూడెం తదితర గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా కూలీల ఫొటోల అప్‌లోడ్ విధానాన్ని ప్రవేశ పెట్టినా దానివల్ల ప్రయోజనం పెద్దగా కన్పించడం లేదు.



తిరుమలంపాలెంలో 20వ తేదీ నుంచి మస్తరు వేయాల్సి ఉండగా ఖాళీగా కన్పిస్తున్న అటెండెన్స్ షీట్

● అత్తిలి మండలంలో పది వేలకు పైగా జాబ్ కార్డులు ఉన్నప్పటికీ కేవలం 8 వేల మందికే పని కల్పిస్తున్నట్లుగా చూపిస్తున్నారు. ఇతర కుటుంబాలు లక్ష్యానికి దరిదాపుల్లోనే లేవు. ఇందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంది. పని కల్పించలేని పరిస్థితులు ఎదురైతే పరిహారం చెల్లించే నిబంధన చట్టంలో ఉంది. అధికారులు, పాలకుల తప్పిదం వల్లే కొంతమందికే ఉపాధి హామీ పనులకు అవకాశం ఉంటున్నది. కుటుంబానికి ఒక్కటే జాబ్‌కార్డు పద్ధతి అమలులో ఉంది. వీటిని కొందరు క్షేత్ర సహాయకులు దుర్వినియోగం చేస్తున్నారు. నేతలకు, అయినవారికి అదనంగా మరో కార్డు సృష్టిస్తున్నారు.పని చేయకున్నా కూలీలుగా నమోదు చేయించి సొమ్ములు జమ చేస్తున్నారు. ఐదేళ్లలో గ్రామ సభలు నామమాత్రంగా మారాయి. నేతలు చెప్పిన పనులే జరిగాయి. సభల నిర్వహణ సమయంలో ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోలేదు. ఎంతోకొంత రికవరీ చూపించడం, తప్పులు మాఫీ చేయించుకోవడం నేర్చుకున్నారు.

బోగస్ మస్తర్లతో సొమ్ము లూటీ

ప్రస్తుతం ఉపాధి పనుల తీరును చూస్తే విస్తుబోయే పరిస్థితి ఏర్పడింది. రోజువారీ కూలీల లక్ష్యం కంటే తక్కువగా వస్తున్నా బోగస్ మస్తర్లు వేసి ఎక్కువ మంది వచ్చినట్లు చూపుతున్నారు. అంతేకాకుండా చేసిన పనికంటే ఎక్కువ చూపుతూ కూలీల నుంచి సొమ్ము వసూళ్లకు తెగ బడతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మేట్లు వారికి కేటాయించిన అడెండెన్స్ షీట్లలో మస్తర్లను వేయడం లేదు.వారానికోసారి నమోదు చేస్తున్నారు. అదేంటని అడిగితే తమకు ఆలస్యంగా ఇచ్చారంటూ సాకులు చెబుతున్నారు. పలుచోట్ల పనికి వచ్చినవారికి హాజరు వేసి రానివారికి ఆబ్సెంట్ వేయకుండా ఖాళీగా ఉంచుతున్నారు. ఆనక బినామీ పేర్లతో మస్తర్లు వేసుకుని సొమ్ములు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక కుటుంబంలో కొందరు పనికి వచ్చి కొందరు రాకుంటే రానివారికి కూడా మస్తరు వేసి వారి నుంచి సొమ్ము వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో కిందిస్థాయిలో అవినీతి మరింతగా పెరిగిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడెంలో ఉపాధిపనులు

శ్రమ దోపిడీ జరుగుతోందిలా :

ఉపాధిహామీ కూలీలు నిర్దేశిత కొలతల ప్రకారం పని పూర్తి చేస్తేనే దానికి అనుగుణంగా కూలీ డబ్బులు వస్తాయి. లేదంటే తగ్గిపోతాయి. అయితే పనికి రాని వారి పేర్ల మీద మస్తరు వేయడం ద్వారా శ్రమదోపిడీ జరుగుతుంది. వాస్తవంగా పని చేసిన కూలీలకు డబ్బులు తక్కువగా వస్తున్నాయి. పలు గ్రామాల్లో వారానికి కూలీ డబ్బులు 1500 కూడా రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనికి రాని వారికి మస్తర్లు వేసి పనిచేసిన కూలీలకు తక్కువ డబ్బులు ఇవ్వడం ద్వారా శ్రమ దోపిడీ జరుగు తోందని ఆరోపిస్తున్నారు. అసలు గ్రామాల్లో లేనివారికి కూడా మస్తర్లు వేయడం వారి నుంచి సొమ్ములు వసూలు చేయడం జరుగు తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

● డ్వామా పీడీ రాము మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించే కిందస్థాయి వారిపై కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. ద్వారకా తిరుమల ఏపీవో హేమంత్ మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఉన్న గ్రామాల్లో విచారణ చేపడతామని, అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు ఉంటాయన్నారు.

మస్తర్ల తనిఖీలు ఎక్కడ

క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీల హాజరు సమయంలో సామూహికంగా చిత్రాలు తీస్తున్నారు. దీనికి జియో టాగ్ చేస్తున్నారు. ఇంత చేస్తున్నా పారదర్శకత కరువైంది. ఎంత మంది కూలీలు ఉన్నారు, వారి హాజరు, నమోదు వివరాలు క్షుణ్ణంగా పరిశీలన చేయడం లేదు. తక్కువ మంది పని చేస్తున్నా ఎక్కువ మంది హాజరు వేసి క్షేత్రస్థాయిలో నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎపీడీ, ఎంపీడీవో, ఎపీఎల్ తనిఖీల్లో డొల్లతనం బయట పెట్టడం లేదని కూలీలు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా ఉపాధిహామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మేట్లను అడ్డుపెట్టుకుని క్షేత్రసహాయకులు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజూ పని ప్రాంతంలో మస్తర్లు వేయాల్సిన మేట్లు వారం చివరిలో ఒక రోజు వేయడం అందుకు నిదర్శనం. గతంలో సహాయకులు కొలతలు ఇచ్చి కూలీలకు మస్తర్లు వేసేవారు. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 50 జాబ్‌కార్డులకు ఒక మేటుని నియమించారు.వారే రోజూ కూలీలను తీసుకువచ్చి కొలతలు ఇప్పించి పనిచేయించాలి. మస్తర్లు కూడా వేయాలి. అనంతరం ఫోన్‌లో కూలీల ఫోటోలను అప్‌లోడ్ చేయాలి.

డీసీసీబీకి గట్టి పోటీ

చైర్మన్ పదవి ఆశిస్తున్న కూటమి నాయకులు

భీమవరం-ఆంధ్రజ్యోతి, జూన్, 24: కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి కోసం గట్టి పోటీ నెలకొంది. కూటమి గెలుపుకోసం శ్రమించిన నాయకులు డీసీసీబీ చైర్మన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం జనసేన పార్టీ నుంచి ఆశావహులు అధికంగా ఉన్నారు. పార్టీలో సీనియర్లు అంతా ఇప్పటికే అధిష్టానాలకు సంకేతాలు పంపారు. ఏడాది పాటు సహకార సంఘాలతో పాటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోనూ చైర్మన్ పదవులకు నామినేటెడ్‌గా భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. తక్షణమే ఎన్నికలు నిర్వహించకుండా తదుపరి కసరత్తు చేయాలని యోచి స్తున్నారు. దీంతో ఆశావహులు అధికంగా ఉన్నారు. మెట్టప్రాంతం నుంచి కరాటం రాంబాబు పేరు వినిపిస్తున్నది. గతంలో ఆయన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరించారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఆశావాహుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది. తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కోల నాగేశ్వరరావు ఈ పదవిని ఆశిస్తున్నారు. తెలుగుదేశం కూడా ఆయనకు ఏదో ఒక పదవి ఇవ్వాలన్న తలంపుతో ఉంది. దాంతో డీసీసీబీ పైనే ఆయన ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. జిల్లా నేతలతోనూ సంప్రదింపులు చేస్తు న్నారు. మరోవైపు మెంటే పార్థసారధి కూడా రేసులో ఉన్నారు. గతంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా వ్యవహరించారు. పార్టీలోనూ రాష్ట్రస్థాయి పద వులను చేపట్టారు. మరోవైపు నర్సాపురం నియోజవర్గానికి చెందిన కలవ కొలను తాతాజీ పేరుకూడా వినిపిస్తున్నది. గడిచిన 30 ఏళ్ళగా సహకార రంగంపై ఆయనకు అనుభవం ఉంది. జనసేన పార్టీలో ఆయన కొన సాగుతున్నారు. తాతాజీ పేరుకూడా డీసీసీబీ రేసులో ప్రముఖంగా విని పిస్తున్నది. వాస్తవానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సహకార సంఘం దారుణంగా దెబ్బతింది. ఐదేళ్ల పాటు ఎన్నికలు నిర్వహించలేదు. పార్టీ నాయకులు, శ్రేణులతోనే త్రిసభ్య కమిటీని నియమించారు. దాంతో సహకార వ్యవస్థ గాడి తప్పింది. సొసైటీలు అన్నీ నష్టాలలో కూరుకుపోయాయి. ప్రభుత్వం నుంచి ధాన్యం కమీషన్ సొమ్ములు కూడా రాలేదు. కోట్లాది రూపాయిలు బకాయి పడింది. త్రిసభ్య కమిటీలు సైతం ప్రశ్నించే పరిస్థితి లేదు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా నష్టాలలో నడుస్తుంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరించింది. కూటమి ప్రభుత్వంలో అయినా సహకార సంస్థ గాడిలో పడుతుందని ఆశిస్తున్నారు. అయితే ఏడాది వరుకూ ఎన్నికలు లేకుండానే తక్షణం నామినేటెడ్ ద్వారా సహకార వ్యవస్థలో చైర్మన్ పదవులను భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం కూడా కసరత్తు చేస్తుంది. దాంతో జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పదవి కోసం కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు

- 27న రాష్ట్రానికి రానున్న అమెరికా, కెనడా ఇంజనీర్లు
- ఏడాదిపాటు సేవలకు ఒప్పందం
- కేంద్రం, పోలవరం అథారిటీ విజ్ఞప్తితో డ్యాం భద్రత పరిశీలన



నిపుణుల బృందానికి 30 ఏళ్ల అనుభవం

పోలవరం, జూన్ 24 : పోలవరం సాగునీటి ప్రాజెక్టు పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలించనుంది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ విజ్ఞప్తి మేరకు ఈ ప్రాజెక్టు పరిశీలనకు అమెరికా, కెనడా దేశాలకు చెందిన నలుగురు ఇంజనీరింగ్ నిపుణుల బృందం ఈ నెల 27న రాష్ట్రానికి రానుంది. ఈ బృందానికి డ్యాం నిర్వహణ, భద్రత, సివిల్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, కట్టడాలకు సంబంధించిన అంశాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉంది. విదేశీ బృందంలో ఇంజనీర్లు డేవిడ్ బి.పాల్ (అమెరికా), రిచర్డ్ డొన్నెల్లీ(కెనడా), డియాన్ ఫ్రాన్స్ డి.సిక్కో(అమెరికా), సీన్ హిచ్‌బర్గర్(కెనడా) ఉన్నారు. ఈ బృందం ఈ నెల 27 నుంచి జూలై 5 వరకు తొమ్మిది రోజులపాటు పోలవరం ప్రాజెక్టులో మకాం వేసి మరీ ప్రాజెక్టు నిర్మాణంలో ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణానికి సవాలుగా ఉన్న డయాఫ్రంవాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇతర ప్రతిబంధక సమస్యల అంశాలను పరిశీలించనుంది. అనంతరం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి నివేదికలు సమ ర్పించనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కటాఫ్ వాల్‌గా నదీ గర్భంలో నిర్మించిన డయాఫ్రంవాల్ 2020లో సంభవించిన వరదలకు కొంతమేర దెబ్బ తినడంతో దానికి సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మించాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రతిపాదించింది. దీనిపై ఈ బృందం అధ్యయనం చేసి అభిప్రాయాన్ని వెల్లడించనుంది. గతంలో జరిగిన అధ్యయనాలు.. ఎగువ కాఫర్ డ్యాం నుంచి అధికంగా వెలువడుతున్న సీపేజీ అరికట్టడానికి రసాయనిక జెట్ గ్రౌటింగ్ ప్రక్రియ, సీపేజీ జలాల తీవ్రత తెలియజేసే పీజియో మీటర్లు ఏర్పాటు చేయడం వంటి వాటి విషయంలో కొన్ని సూచనలు చేశాయి. ఆ సూచనలు ఎంతమేరకు పని చేస్తాయో కూడా ఈ బృందం పరిశీస్తుంది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ అరికట్టడానికి, డయాఫ్రంవాల్ నిర్మాణం విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలో ఈ బృందం నివేదికను అందిస్తుంది. నదీ గర్భం కోతను పూడ్చేందుకు వైబ్రో కాంపాక్షన్, వైబ్రో స్టోన్ కాలమ్‌ల ఏర్పాటు అంశాలపై కూడా ఈ బృందం అధ్యయనం చేసి తక్కువ ఖర్చుతో ప్రత్యా మ్నాయ మార్గాలను చూపవలసి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు అథార్టీల సిఫారసు మేరకు నియమించిన ఈ బృందం ప్రతి మూడు నెలలకు ఒకసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించి సాంకేతిక సలహాలు సూచనలు చేయ నుంది. ఈ బృందం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు ఇంజనీరింగ్ సిబ్బందికి, అధికారులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించనుంది.

మూడు దశాబ్దాల అనుభవం

అంతర్జాతీయ బృందంలో ఉన్న వారికి మూడు దశాబ్దాల అనుభవం ఉంది. డ్యాం భద్రత, మౌలిక వసతుల నిర్వహణలో అమెరికాకి చెందిన అంతర్జాతీయ డ్యాం భద్రతా సీనియర్ కన్సల్‌టెంట్ డేవిడ్ బి.పాల్‌కు 30 ఏళ్ల అనుభవం ఉంది. హైడ్రాలిక్ నిర్మాణాలు నీటి వనరుల నిర్వహణలో కెనడాకి చెందిన రిచర్డ్ డొన్నెల్లీకి కూడా మూడు దశాబ్దాల అనుభవం ఉంది. అమెరికాలోని ఫ్లోరిడా నగరానికి చెందిన గియాస్ ఫ్రాంకో డి.సిస్కోకి భారీ డ్యాంల నిర్మాణం, నిర్వహణ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్‌లో 28 ఏళ్ల అనుభవం సొంతం. ఇక, కెనడాకు చెందిన జియో టెక్నికల్ కన్సల్టెంట్ సీన్ హించ్ బెర్గర్‌కు జియో టెక్నికల్ ఇంజనీరింగ్ నీటిపారుదల నిర్వహణలో 25 ఏళ్ల అనుభవం ఉంది.

మేలోనే గుర్తింపు

అంతర్జాతీయ నిపుణులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఈ ఏడాది మే నెలలోనే గుర్తించి వారి వివరాలను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపింది. వీరిని అప్పుడే నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వవలసి ఉంది.అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అంతర్జాతీయ నిపుణులకు నియామకపత్రాలను ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడం కేంద్ర జలశక్తి మంత్రిగా పాటిల్ బాధ్యతలు స్వీకరించడంతో అంతర్జాతీయ నిపుణులను నియమించారు. ఈ నిపుణులు ఈ నెల 27వ తేదీ నుంచి పోలవరం సాగునీటి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటిస్తారు. 29న ఢిల్లీ నుంచి జలశక్తి మంత్రిత్వశాఖ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహిస్తారు.ఈ నిపుణుల బృందం ఏడాది పాటు సేవలు అందించేలా పీపీఏ ఒప్పందం చేసుకుంది.

క్రైం కార్నర్

కాలువలో మునిగి వృద్ధుడి మృతి

పెంటపాడు, జూన్ 24 : గేదె కోసం వెళుతూ మురుకుకాలువలో పడి వృద్ధుడు మృతి చెందాడు. గణపవరం మండలం కాశిపాడు గ్రామానికి చెందిన గూడపాటి రత్నంరాజు (69) సోమవారం ఉదయం గేదెను మేపేం దుకు బోడపాడు మురుగుకాలువ సమీపానికి వచ్చాడు. గేదె తప్పిం చుకుని కాల్వలో దిగడంతో గేదెను పట్టుకునే క్రమంలో వృద్ధుడు కాలువలో మునిగి మృతిచెందాడు. పెంటపాడు ఎస్ఐ శీలం శంకర్ సంఘటనా స్థలాన్ని పరి శీలించి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామచంద్రపురంలో చోరీ

రెండు కాసుల బంగారు తాడు, రూ.20 వేలు అపహరణ



పరిశీలిస్తున్న క్లూస్‌టీం

పెదపాడు, జూన్ 24 : పెదపాడు శివారు రామ చంద్రపురంలో ఇంటి తాళాలు పగులకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు దొంగ తనానికి పాల్పడిన ఘట నపై పెదపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రామచంద్రపురానికి చెందిన దొగ్గా సరోజనికి ఇద్దరు కుమారులు కాగా, వీరు ఉద్యోగాల రీత్యా వేరే ప్రాంతాల్లో నివాసముంటున్నారు. సరోజని ఒంటరిగా నివాసముంటూ కొన్నిరోజుల క్రితం సమీపంలోనే ఉండే కుమార్తె ఇంటికి వెళ్లింది. విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న చిన్న కుమారుడు రాజు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి రాగా అప్పటికే తలుపులు తెరిచి ఉండ టంతో లోపలకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఘటనలో రెండు కాసుల బంగారు తాడుతో పాటుగా రూ.20 వేలు నగదు పోయినట్లుగా ఫిర్యాదులో పేర్కొ న్నారు. పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు సీజ్



పెదపాడు, జూన్ 24 :పెదపాడు, పరిసర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీలు నిర్వహి స్తుండగా చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను పెదపాడు పోలీసులు సోమ వారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రెండు వాహనాలకు సంబంధించి వాహన యజమాని, డ్రైవర్లు, చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను గొయ్యితీసి పూడ్చి పెడతామని ఎస్సై చెప్పారు.

జనసేన సభ్యుడిపై వైసీపీ కార్యకర్తల దాడి



గాయాలతో బాధితుడు పవన్

ద్వారకాతిరుమల, జూన్ 24: జనసేన పార్టీలో పనిచేస్తున్నాడన్న కక్షతో ఆ పార్టీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడికి తెగబడ్డారు. మద్యం సీసాతో దాడి చేసి గాయపర్చినట్లు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని పంగిడిగూడేనికి చెందిన తైదుల పవన్‌కుమార్ స్థానికంగా కిరాణా షాపు నిర్వహించుకుంటూ జనసేన పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నాడు.ఆదివారం రాత్రి 9 గంటలు దాటిన తర్వాత గ్రామంలోని ఓ మార్ట్‌కు సరుకులు నిమిత్తం వెళ్తున్నాడు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన 13వ వార్డు సభ్యుడు చోడే శేఖర్, అతని మేనల్లుడు ఏసు పవన్ బైక్‌ను ఆపి వారి చేతిలో ఉన్న మద్యం సీసాతో దాడి చేశారు. "మొన్న టీడీపీ వాడు కాలి అశోక్‌ను కొట్టాం...ఏం చేయలేకపోయాడు..ఇప్పుడు నిన్ను కొడతాం.. ఏం చేస్తారురా" అంటూ దౌర్జన్యం చేసినట్లు బాధితుడు తెలిపాడు. శేఖర్ వైసీపీ నాయకుడు గుమ్మడి శ్రీను వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తనకు వైసీపీ నాయకుల నుంచి ప్రాణభయం ఉందని పవన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సరిహద్దు తగాదా..భార్యాభర్తలపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూన్ 24 : మండలంలోని మంగిశెట్టిగూడెంలో ఓ మహిళపై దాడి చేసి గాయపరచిన ఘటనలో భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాసు తెలిపారు. మంగిశెట్టిగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి కనకదుర్గ బ్యూటీ పార్లర్ నడుపుతూ జీవిస్తున్నది. సరిహద్దు తగాదాలపై ఆమె ఇంటి పక్కనే ఉన్న నల్లగోపు చిరంజీవి, అతని భార్య శివపార్వతిలపై తన తల్లిని కొట్టారని కనకదుర్గ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం కనకదుర్గ ఇంటి వద్ద చిరంజీవి భార్య చెత్త వేయడంతో కనకదుర్గ ప్రశ్నించింది.దీంతో చిరంజీవి, శివ పార్వతి కలిసి కనకదుర్గను కింద పడవేసి కొట్టడంతో తీవ్ర గాయా లయ్యాయి. స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సీఐ రాజేష్, ఎస్సై బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు.

మాజీ వలంటీర్ ఆత్మహత్యాయత్నం

జంగారెడ్డిగూడెం, జూన్ 24 : ఆర్థిక ఇబ్బందులతో మాజీ వలంటీర్ పఠాన్ నగీనా చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగింది. కుటంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది. వలంటీర్ తల్లి విలేకరులతో మాట్లాడుతూ తన కుమార్తె తూర్పు గోదావరి జిల్లా గోపాలపురంలో వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నదని తెలి పారు. తన భర్త చనిపోయారని తన కుమార్తె వలంటీర్‌గా పనిచేస్తూ చూసు కుంటుందన్నారు. ఇటీవల రాజీనామా చేయడంతో ఉద్యోగం లేక జంగా రెడ్డిగూడెంలోని తన ఇంటి దగ్గర ఉంటున్నదని తెలిపారు. ఆర్థిక ఇబ్బం దులతో తన కుమార్తె మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నట్లు తెలిపారు. తన కుమార్తెకు తిరిగి వలంటీర్ ఉద్యోగం ఇప్పించి ఆదు కోవాలని ఆమె కోరింది. ఈ ఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక ఎస్సై జ్యోతి బాసు తెలిపారు.

వృద్ధురాలి శరీరదానం

వైద్య కళాశాలకు అప్పగించిన కుటుంబ సభ్యులు



భీమవరం క్రైం, జూన్ 24 : మరణం అన్నది ప్రతీ ఒక్కరికి సహజం.. కానీ పదేళ్ల క్రితమే తమ మరణానంతరం పార్థివ దేహాలను వైద్య కళాశాలకు ఇవ్వాలని తలచారు భీమవరానికి చెందిన ఇద్దరు వృద్ధ దంపతులు. భీమవరం గునుపూడికి చెందిన గుబ్బల ప్రభావతి (83) ఆదివారం వృద్ధాప్యంతో కన్నుమూశారు. అయితే తన మరణానంతరం తన పార్థివ దేహాన్ని రాజ మండ్రి వైద్య కళాశాలకు అందజేయాలని ఆమె అంగీకార పత్రం రాసి ఇచ్చారు. అయితే ఆమె కోరిక మేరకు ఆమె భర్త గుబ్బల సత్యనారాయణ మూర్తి, కుమారులు రమేష్‌బాబు, ప్రసాద్‌లు జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి ప్రభావతి మృతదేహాన్ని అందజేశారు. కళాశాలలోని మెడికోలు, ఇతర సిబ్బంది కలిసి గౌరవవందనం సమర్పించి అనంతరం అనాటమీ డిపార్ట్ మెంట్‌కు ఆమె మృతదేహాన్ని స్వీకరించారు. వైద్య పరిశోధనలు నిమిత్తం ప్రతీఒక్కరూ శరీర, అవయవ దానాన్ని ప్రోత్సహించాలని ప్రభావతి కుటుంబ సభ్యులు కోరారు.

సారా విక్రయం, మోటారు సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

టి.నరసాపురం, జూన్ 24: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు.మక్కినవారిగూడెం పంచాయ తీలోని గౌరీశంకరపురం గ్రామానికి చెందిన మొల్లేటి రాంబాబు సారా తయారు చేసి విక్రయించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో జరిగే జాతరలలో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తన సిబ్బందితో సోమవారం దాడిచేసి రాంబాబును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా,26 మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకుని చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే రోషన్


ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

చింతలపూడి, జూన్ 24: పట్టణంలో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పుష్కరం గడిచినా పురోగతి లేదు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ సోమవారం ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను, ఇబ్బందులను తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల భవనాల నిర్మాణ పనులను ఏపీఎంఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో వంద పడకల ఆసుపత్రి సమస్య ఒకటని, దీనిని నవంబర్ నాటికి పూర్తి చేయిస్తానన్నారు. ప్రతి రెండు వారాలకు ఆసుపత్రిలో అందుతున్న సేవలు, నిర్మాణ పనులపై సమీక్ష చేస్తానన్నారు. ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది పేద, బడుగు వర్గాలేనని, మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని డాక్టర్లు, సిబ్బందికి సూచించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో కలసి సెంట్రల్ లైటింగ్ సమస్యపై చర్చించారు. ఆయన వెంట జగ్గవరపు ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, కోండ్రు దేవ, చీదరాల మధుబాబు, టీఎన్‌వి.కుమార్, టి.వెంకటనారాయణ, బి.నాగభూషణం, కె.శేషగిరిరావు, సొంగా ఏసుపాదం, పలువురు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అధికారులు పార్టీలకు అతీతంగా ప్రజాసేవ చేయాలన్నారు. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలన్నారు. మండలంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, సాగునీరు సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ ప్రసాద్, గరిమెళ్ళ చలపతిరావు, జగ్గవరపు ముత్తారెడ్డి, గుత్తా సత్యసాయివరప్రసాద్, మోరంపూడి మల్లికార్జునరావు, గారపాటి బుజ్జియ్య, ముసునూరి రాము, నందిగం సీతారామ్‌తిలక్, సుధీర్‌బాబు, బొంతు రాంబాబు, బొంతు శ్రీను, అసిలేటి అజయ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, జూన్ 24: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎంఎంపురం, పూళ్ళ గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఎంఎంపురంలో ఎమ్మెల్యే ధర్మరాజు, వట్టి పవన్ సంయుక్తంగా రూ.3 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. పేరంటాల చెరువు ఇన్‌లెట్ నుంచి నీటిని విడుదల చేశారు. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి వెంకన్న ఆర్థిక సహాయంతో 150 మంది కుటుంబాలకు ఏర్పాటు చేసిన ఉచిత కుళాయిలను ధర్మరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు


నియామకపత్రం అందజేస్తున్న జేసీ

ఏలూరు కలెక్టరేట్, జూన్ 24: దివ్యాంగుల బ్యాగ్‌లాగ్ ఉద్యోగాల నియామకంలో భాగంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఒకరికి జేసీ లావణ్యవేణి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఐటీడీఏ పరిధిలో వంట మనిషి పోస్టుకు నియామకమైన షెడ్యూల్ తెగలకు చెందిన మరిడి విజయకు ఉత్తర్వులను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రాకాడ మణి, డీఆర్వో డి.పుష్పమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలోని రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ జేసీ లావణ్యవేణికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ, కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం అమ్మిన రైతులకు రూ.240కోట్లు బకాయి చెల్లించాలన్నారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు గత ప్రభుత్వం జారీచేసిన జీవో 22 రద్దు చేయాలన్నారు. పాడి రైతులకు లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. సమగ్ర భూసర్వేలో జరిగిన లోపాలను సరిచేసి ఖచ్చితమైన పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెదవేగి, జూన్ 24: వర్షాకాలం ప్రారంభమైందని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీపీఆర్సీ రీసోర్స్‌పర్సన్ బీహెచ్ఎస్వీ.కృష్ణంరాజు సిబ్బందికి సూచించారు. పినకడిమి, పెదకడిమి, అమ్మపాలెం, భోగాపురం గ్రామాల్లో డీపీఆర్సీ బృందం సోమవారం పర్యటించి పారిశుధ్యం పరిశీలించింది. కృష్ణంరాజు మాట్లాడుతూ వర్షాకాలం నీరు నిల్వ ఉండి దోమలు పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. తద్వారా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాడకంలేని తొట్టెలు తొలగించాలని తెలిపారు. క్లోరినేషన్ చేసిన, తాగునీటిని సరఫరా చేయాలని ఆయన సూచించారు. కృష్ణంరాజు వెంట ఎఫ్‌టీసీ శ్యామలరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

పోలవరం, జూన్ 24: మండలంలో ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బందికి డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం సచివాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి వైకొండలరావు మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను 15 రోజులకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్న వారి వివరాలు ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆశలు, ఏఎన్ఎంలకు సూచించారు. పారిశుధ్య నిర్వహణలో సమస్యలు తమ దృష్టికి తేవాలన్నారు.

గిరిజన రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ


వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు, జూన్ 24: గిరిజన రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. రైతుభరోసా కేంద్రంలో ఏవో బాలాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు పర్యవేక్షణలో 90శాతం రాయితీతో రైతులకు వరి విత్తనాలు అందించారు. బీపీటీ 5204, ఎంటీయూ 1061, 1064, 7029 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్కోరైతుకు గరిష్ఠంగా 5 బస్తాలు అందిస్తామన్నారు. ప్రతీ రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. గిరిజన రైతులు పట్టాదారుపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు నకలు, ఫోన్ నెంబర్‌తో రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు తీసుకోవచ్చని తెలిపారు. యుగంధర్, లక్ష్మణాచార్యులు, వరలక్ష్మి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

పెదవేగి, జూన్ 24: ప్రభుత్వం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికద్వారా ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సూర్యప్రభ తెలిపారు. పెదవేగి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. పలువురు వ్యక్తులు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక, గృహ నిర్మాణశాఖ ఏఈ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి పాల్గొన్నారు.

పెదపాడు తహసీల్దార్ కార్యాలయంలో..

పెదపాడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను తహసీల్దారు భవన్నారాయణ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. తహశీల్దారు భవన్నారాయణ మాట్లాడుతూ సమస్యలపై అర్జీ అందించే సమయంలో తప్పకుండా ఆధార్, ఫోను నెంబర్లను ఇవ్వాలన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ఆ సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెత్త రహదారి

ద్వారకా తిరుమలలో పారిశుధ్యం అధ్వానం


ద్వారకా తిరుమల ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

ద్వారకాతిరుమల, జూన్ 24: వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం ప్రధాన సమస్యగా మారింది. ద్వారకా తిరుమల గ్రామంలో రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. పంచాయతీ పాలకులు, అధికారులు పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎక్కడి చెత్తను అక్కడే వదిలి వేయడంతో రహదారులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. జిల్లాలో ప్రముఖ క్షేత్రమున్న ద్వారకా తిరుమల గ్రామంలో రోజుల తరబడి రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తరలించకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రంలో చెత్త రహదారులతో భక్తులు అవాక్కవుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో అధికారులు సైతం గుడికి వెళ్లేక్రమంలో చెత్త రహదారులపై రాకపోకలు సాగిస్తారు. ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రముఖ క్షేత్రమున్న పంచాయితీలో పారిశుధ్యం మెరుగుపరచాలని, భక్తులతో పాటు స్థానికులకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


సిమెంట్ రోడ్డుకిరువైపులా డ్రెయినేజి చెత్త


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి



చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు టూటౌన్, జూన్ 24: ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. వైఎస్సార్ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. తన దగ్గరకి వచ్చేవారు పూలదండలు, బొకేలు తీసుకురాకుండా పుస్తకాలు తీసుకురావాలనడంతో ఎంతో మంది పుస్తకాలు, పెన్నులు తీసుకొచ్చారన్నారు. వాటిని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజాసమస్యలపై విరామం లేకుండా నిరంతరం శ్రమిస్తానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మాజీ మేయర్ చోడే వెంకటరత్నం, శ్రీనివాసరావు, ఎంపీటీసీ దావూద్, టీడీపీ, జనసేన నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మాజీ ఎంపీపీ చెక్కపల్లి మాణిక్యాలరావు అన్నారు. శనివారపుపేట పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని, ఉత్తీర్ణత సాధించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు.

● దెందులూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చింతమనేని సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలను కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం శర్మ, గుత్తా రాజాతో కలసి అందజేశారు. బాల మురళీకృష్ణ, కసుకుర్తి రామకృష్ణ, నిట్టా సుభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలోని కొవ్వూరుగూడెం, రామకృష్ణానగర్ ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. అనిష్కుమార్, భూషణం, నత్తా రవి, మన్యం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: తిరుమల దేవిపేట రామన్నపాలెం పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం షేక్ సయ్యద్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పీఎస్ పవన్‌కుమార్, పి.సురేష్, వెంకట్రావు, రాయపూడి లింగాచారి, శ్రీను, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురం పాఠశాల విద్యార్థులకు జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, దాసరి శ్యాం చంద్రశేషు, ఎలికే తాతారావు, ఎలికే ప్రసాద్, పోల్నాటి శ్రీను, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కిట్‌లను పంపిణీ చేశారు. తాడువాయి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కొడవటి సత్తిరాజు, కని గొళ్ళ శ్రీను, కొడవటి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ ఇస్మాయిల్, జంగారెడ్డిగూడెం పట్టణం గరుడ పక్షినగర్ పాఠశాల విద్యార్థులకు మానికల నాగేశ్వరరావు, మానికల సూరిబాబు, కనకరాజు, నేలపోలు ప్రభాకర్, ఉపాధ్యాయులు కిట్‌లు పంపిణీ చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


పాలభిషేకం చేస్తున్న నేతలు

ద్వారకా తిరుమల, జూన్ 24: ఎన్నికల మేనిఫెస్టో అమలుకు సీఎం శ్రీకారం చుట్టడంతో ద్వారకా తిరుమల మండలంలోని పలువురు నాయకులు సోమవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ వాణిజ్య విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ, లాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పెన్షన్ రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు మంత్రివర్గం ఆమోదం తెలుపడం హర్షణీయమన్నారు. కూరాకుల బుజ్జి, రేపూరి వెంకటేశ్వరరావు, వీరిశెట్టి రామారావు పాల్గొన్నారు.

● కామవరపుకోట: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో ప్రజలకు ఊరట కలిగిందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సీఎం తొలి ఐదు సంతకాలకు కేబినెట్ ఆమోదం లభించడం హర్షణీయమన్నారు.

జనసేనలో మహిళలు చేరిక


జనసేనలో చేరిన మహిళలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 24 : నగరంలోని పలు డివిజన్లకు చెందిన మహిళలు సోమవారం జనసేన కార్యాలయంలో రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. మహిళలకు అప్పలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విధి విధానాలకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలని, ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుండాలని చెప్పారు. ఊడి మాణిక్యం, ఘంటా సత్యవతి, పాలూరి భవాని, బండారు దుర్గ, సత్యవతి, సింహాచలం తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, రవి, ఒబిలిశెట్టి శ్రావణగుప్త, ఎట్రించి ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

పెదపాడు, జూన్ 24: గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణతో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపీడీవో తేజరతన్ గ్రామ, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై గ్రామ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామాల వారీగా పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సూర్యకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ధామ్‌ను దర్శించుకున్న జన సైనికులు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 24 : పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద వాసవీ ధామ్‌ను సోమవారం జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలందరికీ మంచి జరిగే విధంగా దీవించాలంటూ పూజలు చేశారు. ఆయన వెంట నగిరెడ్డి కాశీ నరేష్, ఒబిలిశెట్టి శ్రావణగుప్త, రవి తదితరులు ఉన్నారు.

అంబికాదేవి సన్నిధిలో భగవద్గీత ప్రవచనం

ఏలూరుకార్పొరేషన్, జూన్ 24 : సత్రంపాడు అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ ఇస్కాన్ గురూజీ రాధ వల్లభదాస్ ప్రభూజి భగవద్గీత ప్రవచనాన్ని సోమవారం నిర్వహించారు. రెండు గంటలపాటు భగవద్గీత ప్రవచనం నిర్వహించి భక్తుల సందేహాలను నివృతి చేశారు.


కుటుంబ సభ్యులకు చెక్‌లు అందిస్తున్న ఎస్‌ఐలు

మృతి చెందిన ఎస్‌ఐ కుటుంబానికి సహోద్యోగుల ఆర్థిక సహాయం

ఏలూరు క్రైం, జూన్ 24: సీఐడి విభాగంలో పనిచేస్తూ ఆకస్మికంగా మరణించిన ఎస్‌ఐ వంపనబోయిన వెంకటరమణ కుటుంబానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 2012 బ్యాచ్ ఎస్‌ఐలు ఆర్థిక సహాయాన్ని అందించారు. 2012 బ్యాచ్ ఏపీ, తెలంగాణ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.30 లక్షలను వారి కుటుంబానికి అందజేశారు. ఏలూరు జోన్ 2012 బ్యాచ్‌నకు సంబంధించిన ఎస్‌ఐలు రూ.5 లక్షలు సేకరించి వారి కుటుంబానికి అందించారు. ఉమ్మడి రాష్ట్ర ఎస్‌ఐలు మాట్లాడుతూ 18 ఏళ్ల భారత సైన్యంలో సేవలందించి 45 సంవత్సరాల వయస్సులో పోలీస్ ఉద్యోగంపై మమకారంతో ఎస్‌ఐగా ఎంపికై అధికారుల, ప్రజల మన్ననలు పొందారన్నారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం ఎంతో దురదృష్టకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

సోదెం వారి ఇలవేల్పును దర్శించుకున్న పీవో


పూజలు చేస్తున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, జూన్ 24: బుట్టాయగూడెం మండలం కేఆర్.పురం పంచాయతీ పరిధిలోని మెరకగూడెంలో సోదెం వారి ఇలవేల్పులైన చిన అధమరాజు, పెద అధమరాజును ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ సోమవారం దర్శించుకున్నారు. ఇలవేల్పులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి సోదెం సుధాకర్ పీవోకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో బిల్వార్చనలు

ఏలూరుకార్పొరేషన్, జూన్ 24: నగరంలోని శివాలయాల్లో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకులు వెంకటరత్నం శర్మ భక్తులతో పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపించారు. దక్షిణపువీధి మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, కాశీ ప్రతాప విశ్వేశ్వరస్వామి, పవరుపేటలోని విశ్వేశ్వరస్వామి, పత్తేబాదలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు పూజలు చేశారు.

15న ఏలూరులో జగన్నాథ రథయాత్ర

ఏలూరుకార్పొరేషన్, జూన్ 24 : ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జూలై 15న ఏలూరు నగరంలో జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ రథయాత్ర శనివారపుపేట, లునాని పార్కు, ఇస్కాన్ మందిరం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్, ఆర్‌ఆర్‌పేట, మెయిన్ రోడ్డు, వన్‌టౌన్, మెయిన్‌బజార్, రామకోటి వరకు కొనసాగుతుందని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం తెలియజేసింది.

హైవేపై ప్రమాదాల నివారణకు కార్యాచరణ : చింతమనేని


ప్రమాద ప్రాంతాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూన్ 24: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు నియోజకవర్గం పరిధిలో కలపర్రు టోల్‌గేట్ దగ్గర నుంచి గుండుగొలను వరకు రహదారిపై తరచు ప్రమాదాలు జరిగే కొమిరేపల్లి, సీతంపేట, దెందులూరు, వంగూరు, అమ్మపాలెం, వట్లూరు తదితర ప్రాంతాలను ఆర్డీవో ఎన్ఎస్‌కే.ఖాజావలి, తహసీల్దారు సూర్యప్రభ, హైవే అథారిటీ అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. హైవేపై ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. సర్వీస్ రోడ్లు లేకపోవడం కారణంకాగా, కొన్ని చోట్ల అండర్‌పాస్‌లు లేకపోవడం మరో కారణంగా గుర్తించామని చింతమనేని చెప్పారు. దీనిపై సమీక్షించి, పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అధికారులతో జేసీ, ఎమ్మెల్యే సమీక్ష

ఏలూరు సిటీ: ఆరులైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో దెందులూరు నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలపై జూలై 10లోగా చర్యలు తీసుకోవాలని జేసీ బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలసి జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జాతీయ రహదారి-16లో హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను వరకు పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాలలోని కొన్ని ప్రదేశాల్లో నిబంధనల మేరకు సర్వీసు రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం లేకపోవడం, రహదారిలో ఎత్తుపల్లాల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రెయిన్స్, కల్వర్టులు సక్రమంగా నిర్మించని కారణంగా సాగు నీరు, వర్షపు నీరు ప్రవాహానికి సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యలపై జూలై 10లోగా చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మట్లాడుతూ జాతీయ రహదారి-16లో ఆరు లైన్ల రహదారి నిర్మాణంలో అవసరమైన ప్రదేశాల్లో బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు, సర్వీస్ రహదారులు, డ్రెయిన్స్, కల్వర్టుల నిర్మాణం వంటి పనులు రహదారి నిర్మాణ డిజైన్‌లో పొందుపరచలేదన్నారు. దీనితో రోడ్డుపై ఎత్తుపల్లాలు, కుంగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారి నిర్వహణకు ప్రతి నెల రూ.24 లక్షలు ప్రభుత్వం సంబంధిత కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తుందన్నారు. నిర్వహణ పనులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ జాన్‌మోషే, ఆర్డీవో ఖాజావలి, జాతీయ రహదారి, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.


పోలవరం మెయిన్ రోడ్డులో వర్షం జోరు

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, జూన్ 24: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటుకలకోట పంచాయతీలో వర్షపునీరు ముంచెత్తే పరిస్థితి తలెత్తడంతో సర్పంచ్ సున్నం చంద్రమ్మ డ్రైనేజీల పూడికతీత పనులు చేయించి తూరలు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో వర్షపునీరు బయటకు వెళ్ళే మార్గం లేక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పట్టిసీమ వీరభద్రపురం కాలనీలో మోకాలి లోతు నీరు నిలిచి నివాసాల్లోకి నీరు చేరింది. పోలవరం మెయిన్ రోడ్డు, బెస్తావీధి, కమ్మరగూడెం, బీసీ కాలనీ, బాపూజీ కాలనీ, కొత్తపేట కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది.

నేటి నుంచి విద్యా కార్యాచరణపై సమావేశాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 24: విద్యా కార్యక్రమాలు, పథకాలు, విద్యార్థుల నమోదు, హాజరుపై రానున్న మూడు నెలల కాలానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల్లో రోజువారీ సందర్శన తదితర అంశాలే అజెండాగా ఎంఈవోలు, హెచ్ఎంలతో డివిజన్ స్థాయి సమావేశాలను మంగళవారం నుంచి ప్రారంభించడానికి జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. 25న ఏలూరు, 26న నూజివీడు, 27న జంగారెడ్డిగూడెం డివిజన్లలో మండల విద్యాధికారులతో డీఈవో అబ్రహం సమావేశం నిర్వహించనున్నారు. వచ్చేవారం నుంచి ప్రధానోపాధ్యాయులతో స్థానికంగానే సమావేశాలను నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి ఈ ఏడాది 23 వేల ప్రవేశాల లక్ష్యంగా నిర్ణయించారు. సోమవారం వరకు 17వేల ప్రవేశాలు పూర్తి చేయగా గురువారంలోపు లక్ష్యం మేరకు విద్యార్థుల ప్రవేశాలు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్ష ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 24: జిల్లాలో సోమవారం జరిగిన డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) 4వ సెమిస్టర్ పరీక్షకు 71మంది విద్యార్థులు హాజరయ్యారైనట్లు డీఈవో అబ్రహం తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని, పశాంతంగా పరీక్ష జరిగిందన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 24 : మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లోవున్న సర్వీస్‌రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మానవ వనరుల శాఖమంత్రి నారా లోకేశ్‌కు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, గిరిప్రసాద్ వినతిపత్రాన్ని అందజేశారని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు సోమవారం తెలిపారు. సీనియార్టీ ప్రకారం ఎంఈవో-2లను ఖాళీగావున్న ఎంఈవో-1 పోస్టుల్లో నియమించాలని కోరామన్నారు. సీపీఎస్‌ను రద్దుచేయాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. మంత్రితోపాటు, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కోన శశిధర్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారని వివరించారు.

12 అడుగుల కొండచిలువ హతం



టి.నరసాపురం, జూన్ 24: గ్రామస్తుల చేతిలో 12 అడుగుల కొండచిలువ హతమైన సంఘటన టి.నరసాపురం పంచాయతీ పుట్రేలలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఒక రైతు ఇంటి సమీపంలోని కోళ్ళ గాబులో కొండచిలువ ప్రవేశించింది. కోడి పుంజును మింగుతుండగా కోళ్ళ అరుపులతో కుటుంబ సభ్యులు కొండచిలువను గమనించారు. స్థానికుల సాయంతో దానిని హతమార్చారు. నిత్యం జన సంచారంతో ఉండే ప్రదేశంలో కొండచిలువ కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కోళ్ళు, మేకలను మింగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **జంగారెడ్డిగూడెం :** పట్టణంలోని వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పి.రాజేష్ తెలిపారు. ఎస్సై జ్యోతిబాసు ఉన్నారు.
- జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మంగళవారం పలు కార్యక్రమాలలో పాల్గొంటారని రావూరి కృష్ణ, తూటిగుంట రాము తెలిపారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ చేస్తారు. ఏరియా ఆసుపత్రిని సందర్శిస్తారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.
- **ద్వారకా తిరుమల :** ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అనంతరం మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం శ్రీవారిని దర్శించనున్నారు. ఉదయం 8-30 గంటలకు శ్రీవారిని దర్శించనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు లంకా సత్తిపండు తెలిపారు. అనంతరం ఆయన ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు.
- **కామవరపుకోట :** గొల్లగూడెంకు చెందిన చింతపల్లి సత్యనారాయణ కుటుంబానికి ఈదురు గాలులతో నష్టం వాటిల్లడంతో టీడీపీ శ్రేణులు రూ.5 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఘంటా సుధీర్‌బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, నెక్కలపు సూర్యనారాయణ పాల్గొన్నారు.
- కామవరపుకోట మండలం ఆడమిల్లి 400 కెవి విద్యుత్ లైన్లు మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ ఉదయం 3 నుంచి 7 గంటల వరకు, మరలా సాయంత్రం కూడా ఇవ్వడం జరుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.
- **పోలవరం :** కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు పోలవరం మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ముచ్చిక సీత, నాయకులు ఆర్థిక సహాయం అందించారు. రూ.7 వేల ఆర్థిక సహాయం మంచం, దుస్తులు, అందించారు. ఏపిసిసి ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర, కుటుంబరావు, కొయ్యలగూడెం మండల నాయకులు కె రాజారత్నం పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** మండలంలోని అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు అన్నారు. నాయకులు, అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో సమస్యలు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటివరకు జరిగిన పనుల్లో అవినీతి ఉంటే బయటకు తీయాలని స్థానిక నాయకులకు తెలిపారు.

పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు

27న రాష్ట్రానికి రానున్న అమెరికా, కెనడా ఇంజనీర్లు



ఏడాదిపాటు సేవలకు ఒప్పందం
కేంద్రం, పోలవరం అథారిటీ విజ్ఞప్తితో డ్యాం భద్రత పరిశీలన
నిపుణుల బృందానికి 30 ఏళ్ల అనుభవం

పోలవరం, జూన్ 23 : పోలవరం సాగునీటి ప్రాజెక్టు పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలించనుంది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ విజ్ఞప్తి మేరకు ఈ ప్రాజెక్టు పరిశీలనకు అమెరికా, కెనడా దేశాలకు చెందిన నలుగురు ఇంజనీరింగ్ నిపుణుల బృందం ఈ నెల 27న రాష్ట్రానికి రానుంది. ఈ బృందానికి డ్యాం నిర్వహణ, భద్రత, సివిల్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, కట్టడాలకు సంబంధించిన అంశాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉంది. విదేశీ బృందంలో ఇంజనీర్లు డేవిడ్ బి.పాల్ (అమెరికా), రిచర్డ్ డోన్నెల్లీ(కెనడా), డియాన్ ఫ్రాన్స్ డి.సిస్కో(అమెరికా), సీన్ హిచ్‌బర్గర్(కెనడా) ఉన్నారు. ఈ బృందం ఈ నెల 27 నుంచి జూలై 5 వరకు తొమ్మిది రోజులపాటు పోలవరం ప్రాజెక్టులో మకాం వేసి మరీ ప్రాజెక్టు నిర్మాణంలో ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణానికి సవాలుగా ఉన్న డయాఫ్రంవాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇతర ప్రతిబంధక సమస్యల అంశాలను పరిశీలించనుంది. అనంతరం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి నివేదికలు సమర్పించనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కటాఫ్ వాల్‌గా నదీ గర్భంలో నిర్మించిన డయాఫ్రంవాల్ 2020లో సంభవించిన వరదలకు కొంతమేర దెబ్బ తినడంతో దానికి సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మించాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రతిపాదించింది. దీనిపై ఈ బృందం అధ్యయనం చేసి అభిప్రాయాన్ని వెల్లడించనుంది. గతంలో జరిగిన అధ్యయనాలు.. ఎగువ కాఫర్ డ్యాం నుంచి అధికంగా వెలువడుతున్న సీపేజీ అరికట్టడానికి రసాయనిక జెట్ గ్రౌటింగ్ ప్రక్రియ, సీపేజీ జలాల తీవ్రత తెలియజేసే పిజియో మీటర్లు ఏర్పాటు చేయడం వంటి వాటి విషయంలో కొన్ని సూచనలు చేశాయి. ఆ సూచనలు ఎంతమేరకు పని చేస్తాయో కూడా ఈ బృందం పరిశీస్తుంది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ అరికట్టడానికి, డయాఫ్రంవాల్ నిర్మాణం విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలో ఈ బృందం నివేదికను అందిస్తుంది. నదీ గర్భం కోతను పూడ్చేందుకు వైబ్రో కాంపాక్షన్, వైబ్రో స్టోన్ కాలమ్‌ల ఏర్పాటు అంశాలపై కూడా ఈ బృందం అధ్యయనం చేసి తక్కువ ఖర్చుతో ప్రత్యామ్నాయ మార్గాలను చూపవలసి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు అథార్టీల సిఫారసు మేరకు నియమించిన ఈ బృందం ప్రతి మూడు నెలలకు ఒకసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించి సాంకేతిక సలహాలు సూచనలు చేయనుంది. ఈ బృందం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు ఇంజనీరింగ్ సిబ్బందికి, అధికారులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించనుంది.

మూడు దశాబ్దాల అనుభవం

అంతర్జాతీయ బృందంలో ఉన్న వారికి మూడు దశాబ్దాల అనుభవం ఉంది. డ్యాం భద్రత, మౌలిక వసతుల నిర్వహణలో అమెరికాకి చెందిన అంతర్జాతీయ డ్యాం భద్రతా సీనియర్ కన్సల్‌టెంట్ డేవిడ్ బి.పాల్‌కు 30 ఏళ్ల అనుభవం ఉంది. హైడ్రాలిక్ నిర్మాణాలు నీటి వనరుల నిర్వహణలో కెనడాకి చెందిన రిచర్డ్ డొన్నెల్లీకి కూడా మూడు దశాబ్దాల అనుభవం ఉంది. అమెరికాలోని ఫ్లోరిడా నగరానికి చెందిన గియాస్ ఫ్రాంకో డి.సిస్కోకి భారీ డ్యాంల నిర్మాణం, నిర్వహణ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్‌లో 28 ఏళ్ల అనుభవం సొంతం. ఇక, కెనడాకు చెందిన జియో టెక్నికల్ కన్సల్టెంట్ సీన్ హించ్ బెర్గర్‌కు జియో టెక్నికల్ ఇంజనీరింగ్ నీటిపారుదల నిర్వహణలో 25 ఏళ్ల అనుభవం ఉంది.

మేలోనే గుర్తింపు

అంతర్జాతీయ నిపుణులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఈ ఏడాది మే నెలలోనే గుర్తించి వారి వివరాలను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపింది. వీరిని అప్పుడే నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వవలసి ఉంది.అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అంతర్జాతీయ నిపుణులకు నియామకపత్రాలను ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడం కేంద్ర జలశక్తి మంత్రిగా పాటిల్ బాధ్యతలు స్వీకరించడంతో అంతర్జాతీయ నిపుణులను నియమించారు. ఈ నిపుణులు ఈ నెల 27వ తేదీ నుంచి పోలవరం సాగునీటి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటిస్తారు. 29న ఢిల్లీ నుంచి జలశక్తి మంత్రిత్వశాఖ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహిస్తారు.ఈ నిపుణుల బృందం ఏడాది పాటు సేవలు అందించేలా పీపీఏ ఒప్పందం చేసుకుంది.

18 రైళ్లు రద్దు.. 6 రైళ్ల పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 24 : దక్షిణమధ్య నిడదవోలు- కడియం సెక్షన్ల పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ పనుల దృష్ట్యా 18 రైళ్లను సోమవారం నుంచి రద్దు ఆగస్టు 10వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు -కడియం సెక్షన్ల పరిధిలో ట్రాఫిక్ మెయింటి నెన్స్ పనుల నిర్వహణ నిమిత్తం గతంలో రద్దుచేసిన ఆరు రైళ్లను తిరిగి పున రుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.



పునరుద్ధరించిన రైళ్లు

17257 విజయవాడ - కాకినాడ
17258 కాకినాడ పోర్టు- విజయవాడ
12806 లింగంపల్లి-విశాఖపట్టణం
ఈనెల 26 నుంచి పునరుద్ధరణ
12805 విశాఖపట్టణం -లింగంపల్లి ఈనెల 25 నుంచి..
17643 చంగల్‌పట్టు - కాకినాడ పోర్టు ఈనెల 25 నుంచి..
17644 కాకినాడ పోర్టు - చంగల్‌పట్టు ఈనెల 26 నుంచి..

రద్దయిన రైళ్లు

07466 రాజమండ్రి - విశాఖపట్టణం ఈనెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ
07467 విశాఖపట్టణం - రాజమండ్రి 24 నుంచి ఆగస్టు 10 వరకూ
17219 మచిలీపట్టణం - విశాఖపట్టణం 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17220 విశాఖపట్టణం - మచిలీపట్టణం 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17249 తిరుపతి - కాకినాడ టౌన్ 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17250 కాకినాడ టౌన్ - తిరుపతి 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17239 గుంటూరు - విశాఖపట్టణం 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17240 విశాఖపట్టణం - గుంటూరు 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17243 గుంటూరు - రాయగడ 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17244 రాయగడ - గుంటూరు 24 నుంచి ఆగస్టు 11 వరకూ
12718 విజయవాడ - విశాఖపట్టణం 24 నుంచి ఆగస్టు 10 వరకూ
12717 విశాఖపట్టణం- విజయవాడ 24 నుంచి ఆగస్టు 10 వరకూ
22702గుంటూరు-విశాఖ (సోమ,మంగళ) 24 నుంచి ఆగస్టు 10 వరకూ
22701 విశాఖ- గుంటూరు (బుధ,శుక్ర, శని) 24 నుంచి ఆగస్టు 10 వరకూ
12776 లింగంపల్లి-కాకినాడ(సోమ, బుధ, శుక్ర) 24 నుంచి ఆగస్టు 9 వరకూ
12775 కాకినాడ-లింగంపల్లి (మంగళ,గురు,ఆది) 23 నుంచి ఆగస్టు 8 వరకూ
22708 తిరుపతి-విశాఖపట్టణం(బుధ, శుక్ర,ఆది)23 నుంచి ఆగస్టు 9 వరకూ
22707విశాఖపట్టణం-తిరుపతి(సోమ,గురు,శని)24 నుంచి ఆగస్టు 10 వరకూ



వైష్ణవిని సత్కరిస్తున్న టీడీపీ నాయకుడు శోభనాద్రి చౌదరి తదితరులు

వైష్ణవికి టీడీపీ నేతల సత్కారం

ముదినేపల్లి, జూన్ 24 : రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం ఇవ్వటమే కాక, అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవిని పలువురు టీడీపీ నాయకులు సత్కరించారు. సోమవారం టీడీపీ ముదినేపల్లి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, గురజ మాజీ సర్పంచ్ కామినేని వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు చల్లగుళ్ల ఆదిత్య వీరిశెట్టి కొండలరావు, యెలిశెట్టి లక్ష్మీనరసింహారావు తదితరులు వైష్ణవిని అభినందించారు.

సమస్యల కేరాఫ్ కోరుకొల్లు హాస్టల్



తలుపులు ఊడి అధ్వానంగా ఉన్న టాయిలెట్స్

- శిథిలావస్థకు చేరిన భవనం
- మరుగుదొడ్లకు ఊడిన తలుపులు
- తిరగని ఫ్యాన్లు.. తాగునీటికి కటకట
- ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారేరి?
- కొత్త ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రుల వినతి



పెచ్చులూడిన స్లాబ్.. (ఇన్‌సెట్) కోరుకొల్లులోని ఎస్సీ బాలికల హాస్టల్



కలిదిండి, జూన్ 24 : కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు 15 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. భవనం స్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. వర్షానికి స్లాబ్ లీకవటంతో విద్యార్థుల పుస్తకా లు, వస్తు సామగ్రి తడిచి ముద్దవుతున్నాయి. గదుల్లో ఫ్యాన్లు మొరాయిస్తున్నాయి. రాత్రి వేళలో దోమల బెడదతో అల్లాడుతున్నారు. వాటర్ పైపులైన్ పాడైపోవటంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. టాయ్‌లెట్స్ తలుపులు ఊడి అపరిశుభ్రంగా ఉండి బాలికలు నరకయాతన అనుభ విస్తున్నా రు. హాస్టల్ భవనంలో ఒక వైపున ప్రహరీ కూలిపోవటంతో రాత్రి వేళలో భయాందోళన చెందుతున్నారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు సోషల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని బాలికల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి ఎస్సీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎంపీడీవో ఏమన్నారు..?

ఈ విషయమై ఎంపీడీవో దినతేజ్‌ను వివరణ కోరగా, కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్‌లో సమస్యలపై సోషల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులకు నివేదిక పంపినప్పటికీ స్పందన లేదన్నారు. వీలైనంత త్వరగా హాస్టల్ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వద్దు : కామినేని



కూటమి విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, జూన్ 24: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంచినీటి సమస్యపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో 37 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల్లో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అందుకు కావాల్సిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తీసుకువచ్చే బాధ్యత తనదన్నారు. ప్రతి గ్రామంలోనూ అవసరాన్ని బట్టి ఆర్వోప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ తాడినాడ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాస్త్రి, ఏఈలు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై సీఐడీ విచారణ

ఎన్నికల్లో పనిచేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని వైసీపీ నుంచి వచ్చే వారిని చేరనిచ్చే పరిస్థితి లేదని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం కైకలూరులో కూటమి విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ కూటమి గెలుపు కోసం కృషి చేయని వారు తన వద్దకు వచ్చే అర్హత లేదని ఇటీవల కొందరు వచ్చినా తిప్పి పంపానన్నారు. రానున్న ఐదు సంవత్సరాలు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి నెలా అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. పవన్‌కల్యాణ్‌ను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకుంటామని మాట్లాడిన నాయకులు అసెంబ్లీకి రాకుండా పోయారన్నారు. కైకలూరు నియోజకవర్గంలో గత నాయకుల రౌడీ దందాలు, మట్టి దందాలపై సీఐడీ ఎంక్వైరీ చేయిస్తానన్నారు. టీడీపీ నాయకుడు బొర్రా చలమయ్య నాలుగు మండలాల్లో కూటమి కార్యాలయాల ఏర్పాటుకు రూ. 6 లక్షలు కామినేనికి అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు, వీరమల్లు నరసింహరావు, బలే ఏసురాజు, బీకేఎం నాని, జడ్పీ టీసీలు కురేళ్ళ బేబి, బొర్రా సత్యవతి, కూటమి నాయకులు తాడినాడ బాబు, వేంపాటి విష్ణు, నున్న రమాదేవి, ఎండీ జానీ, కొల్లి బాబి తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'కు వినతులు



మండవల్లి తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న ఐక్యవేదిక నాయకులు

నూజివీడు, జూన్ 24: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమానికి 4 అర్జీలు దాఖలైనట్లు నూజివీడు సబ్ కలెక్టర్ వై.భవాని శంకరి తెలిపారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు నుంచి మట్టా కృష్ణ, గొల్లపల్లి నుంచి పామర్తి లోకేశ్, ఈదర నుంచి ప్రకాశం పట్టాదార్ పాస్‌పుస్తకాల కోసం అర్జీలు ఇచ్చారన్నారు. అలాగే నూజివీడు పట్టణం గాంధీనగర్‌కు చెందిన వెల్లంకి శివాజీ పారిశుధ్యం మెరుగు పరచాలని కోరుతూ అర్జీ దాఖలు చేశారన్నారు.

చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'కు మొత్తం ఆరు దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ మహ్మద్ ముక్బూద్ అలీ తెలిపారు, దారి విస్తరణ కోరుతూ ఒకటి, కాలువ ఆక్రమణ తొలిగించాలని ఒకటి, భూముల ఆన్‌లైన్ కోసం 4 అర్జీలు అందినట్టు వివరించారు.

గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలి

మండవల్లి: జూలై 1వ తేదీ నుంచి మండవల్లి మండలంలోని 29 పంచాయతీలలో జరిగే గ్రామసభల షెడ్యూల్‌ను ఈ నెల 25వ తేదీకే తయారు చేసి అన్ని గ్రామ సభలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు కోరారు. సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో జరిగిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'కు భాస్కరరావుతో పాటు మండల శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు, కార్యవర్గ సభ్యులు తహసీల్దార్ సుబానీకి అర్జీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి కీలకమైన గ్రామసభలను తూతూ మంత్రంగా జరుపుతున్నారని, దీంతో ప్రజలు గ్రామసభలకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

డయేరియాను తలెత్తనివ్వద్దు



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కలిదిండి, జూన్ 24 : మండలంలో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దినతేజ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేసిన నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేయాలన్నారు. డ్రైనేజీల వద్ద పైపులైన్ లీకేజీలను అరికట్టాలన్నారు. డ్రైనేజీల వెంబడి దోమల నివారణ మందులను చల్లాలన్నారు. డయేరియా, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాల దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. దోమల నివారణకు కాయిల్స్, దోమ తెరలు వాడాలన్నారు. ఈవోపీఆర్డీ వై.రాజారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాణ్యమైన 'భోజనం' అందించాలి: ఎంఈవో

ముసునూరు, జూన్ 24: విద్యార్థులకు నాణ్యమైన భోజనం రుచికరంగా అందించాలని ఎంఈవో బీవీ సుబ్బారావు అన్నారు. సోమవారం ముసునూరు జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, రుచి ఆయన పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని, ఫిర్యాదులు వస్తే సహించేది లేదని వంట ఏజెన్సీలను హెచ్చరించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.



పెయ్యేరులో సుభద్రమ్మకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సుభద్రమ్మకు నేతల నివాళులు

ముదినేపల్లి, జూన్ 24 : పెయ్యేరు గ్రామ ప్రముఖులు హనుమార బసవ సుభద్రమ్మ సంస్మరణ కార్యక్రమం సందర్భంగా సోమవారం గ్రామ ప్రముఖులు ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుక్కిపాటి రాజేంద్ర ప్రసాద్, శేషుబాబుతోపాటు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు బొర్రా చలమయ్య, పోసిన పాండురంగారావు, ఈడే సుధాకర్, జొన్నలగడ్డ వీరస్వామి తదితరులు సుభద్రమ్మకు శ్రద్ధాంజలి ఘటించి ఆమె కుమారులు పెయ్యేరు మిల్క్ సొసైటీ ఛైర్మన్ పేర్నీడు, రవీంద్రను పరామర్శించారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కలిదిండి, జూన్ 24 : అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. సోమవారం పలు గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న 11 మందిని ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. అనధికార మద్యం విక్రేతలపై కేసులుంటే రౌడీ షీటర్లుగా పరిగణించబడతారని తహసీల్దార్ హెచ్చరించారు.



లోపూడిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు



మండవల్లి మండలం గన్నవరంలో పాఠ్యపుస్తకాల పంపిణీ

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

ముసునూరు, జూన్ 24: లోపూడి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సర్పంచ్ పేరం కృష్ణ, నాయకులు లక్కపాము కాంత రావు, నూతన్, పేరం వెంకటరత్నం పాఠ్య, నోటు పుస్తకాలు కిట్లు అందజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

మండవల్లి: మండలంలోని గన్నవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కూనపురెడ్డి కోటేశ్వరరావు, హెచ్ఎం పాండురంగారావు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ఆంజనేయులు, నామాల చైతన్య, గుడివాడ ప్రసాద్, దామినేని మురళీ, కే అప్పన్న, పి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీగా పెరగనున్న పెన్షన్ బడ్జెట్

ముదినేపల్లి మండలంలో రూ.3.86 కోట్లకు చేరిక

ముదినేపల్లి, జూన్ 24 : ముదినేపల్లి మండలానికి సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ బడ్జెట్ భారీగా పెరగనుంది. కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పేదల పింఛన్‌ను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయటంతో అన్ని రకాల పింఛన్లకు బడ్జెట్ పెరిగింది. జూన్ నెల వరకు మండలంలోని 9062 మంది పింఛన్‌దారులకు నెలకు రూ.2,67,79,000 సొమ్ము పంపిణీ చేయగా, పెన్షన్ల సొమ్ము పెంపు కారణంగా జూలై నెల నుంచి నెలకు ఈ సొమ్ము రూ.3,85,76,000కు పెరగనుంది. అంటే ఇక నుంచి అదనంగా రూ.1,17,97,000 సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంటుంది. 4552 వృద్ధులకు, 2415 వితంతువులకు, 151 మంది గీత కార్మికులకు, 300 మంది ఒంటరి మహిళలకు, 85 మంది చేనేత కార్మికులకు, 23 మంది మత్స్యకారులకు నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, 1207 మంది దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, 65 మందికి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఇచ్చే పెన్షన్లను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచటంతో బడ్జెట్ పెరిగింది.

61వ సారి రక్తదానం



నూజివీడు టౌన్, జూన్ 24: నూజివీడు ఆర్టీసీ డిపోకు చెందిన అసిస్టెంట్ డిపో క్లర్క్ పి.కృష్ణ ప్రసాద్ 61వ సారి రక్తదానం చేయటం విశేషం. కృష్ణాజిల్లా ఉయ్యూరు మం డలం కాటూరుకు చెందిన ఓ తలసేమియా బాధితు రాలికి అత్యవసరంగా రక్తం అవసరమవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు కృష్ణప్రసాద్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఏలూరు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకుకు వెళ్ళి కృష్ణప్రసాద్ 61వ సారి రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం పవన్, సిబ్బంది కృష్ణప్రసాద్‌ను అభినందించారు.

కొప్పుల వెలమ సంఘ అధ్యక్షుడిగా నాగరాజు



ముదినేపల్లి, జూన్ 24 : టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి రెడ్డి నాగరాజు ముదినేపల్లి మండల కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ముదినేపల్లిలో జరిగిన సంఘ సమావేశంలో నాగరాజును అధ్యక్షుడిగా సభ్యులు ఎన్నుకున్నారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా గునుపూడి నాగరాజు, ఉపాధ్యక్షులుగా రెడ్డి రామలింగేశ్వరరావు, సిరిపురపు సత్యనారాయణ, కార్యదర్శిగా నచ్చిరెడ్డి వెంకట పద్మావతి, కోశాధికారిగా కొరిపల్లి రాము ఎన్నికయ్యారు. ఏపీ వెలమ సంఘం కార్యదర్శి గంగునేని వరప్రసాద్, పెదగొన్నూరు మాజీ సర్పంచ్ నాగిరెడ్డి శివ ప్రసాద్, సంఘ నాయకులు పాల్గొన్నారు. కైకలూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో కొప్పుల వెలమ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని నాయకులు కోరారు.



మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నూజివీడు టౌన్, జూన్ 24: నూజివీడు సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలంటూ అవగాహన కార్యక్రమాన్ని విజయవాడకు చెందిన నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూజివీడు సెబ్ ఎస్సై ఎంవీవీబీ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని, కేసుల వల్ల కనీసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా ఉండవని, విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ జి.రవిబాబు మాట్లాడుతూ మత్తుపదార్థాలు అమ్మినా, ఎవరైనా బానిసలుగా కనిపించినా సదరు విషయాన్ని 94904 92020 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలభవన్ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన కాపా



నూజివీడు టౌన్, జూన్ 24: రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్రలో ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉన్న లోకేశ్ మానవ వనరులు, ఐటీ తదితర శాఖలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని కాపా ఆకాంక్షించారు.

మంత్రి రవీంద్రకు బీసీ నాయకుల అభినందన



కలిదిండి, జూన్ 24 : ఎక్సైజ్, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొల్లు రవీంద్రను టీడీపీ కలిదిండి బీసీ నేతలు అమరావతిలో కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ చక్రవర్తి, నాయకులు స్వర్రా అరవింద్, కొల్లాటి పెద్దిరాజు, సంగాని రామకృష్ణ, కొల్లాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు 40 సైకిళ్ల వితరణ

ముసునూరు, జూన్ 24: దాతల ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని నూజివీడు డీవైఈవో సేవ్యానాయక్ అన్నారు. గుడిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులకు గ్రామ ప్రముఖుడు రాయంకుల రామారావు వితరణగా అందించిన 40 సైకిళ్లను సోమవారం దాతతో కలసి ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత రామారావును డీవైఈవో, ఉపాధ్యాయులు సన్మానించారు. గ్రామ ప్రముఖులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



నూజివీడు టౌన్, జూన్ 24: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా నూజివీడు మున్సిపల్ సిబ్బంది ముందస్తు పారిశుధ్య మెరుగుదల పనులను నిర్వహించారు. నూజివీడు యానాది కాలనీలో వర్షాకాలంలో మురుగు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టడంతో పాటు అంతర్గత రహదారులపై బ్లీచింగ్ చల్లి పారిశుధ్యం మెరుగుదల పనులను నిర్వహించారు. నూజివీడు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.